www.peoplesnews.in

హైదరాబాద్

# పీపుల్స్ న్యూస్

ప్రజల గొంతుక... దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 228 బుధవారం, మే 13, 2026 , పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad




## జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండోవిడుత పంపిణీ

- రెండోవిడతపై 21న కేబినేట్‌లో ఖరారు చేస్తాం
- స్పెషల్ డ్రైవ్ ద్వారా డబుల్ ఇళ్లు పంపిణీ
- అధికారులతో సమీక్షించిన మంత్రి పొంగులేటి



**హైదరాబాద్,మే12 :** జూన్ 2న ఆదిలాబాద్ లో ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత ప్రారంభిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల విధివిధానాలు కేబినెట్ ఖరారు చేస్తామని

మిగతా2లో...

# ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం సహించం

● సజావుగా వరి, మొక్కజొన్న కొనుగోళ్లు ● ధాన్యం వెంటనే లారీల్లో తరలించాల్సిందే ● అవసరమైతే పోలీస్ సాయంతో ధాన్యం సేకరణ ● లారీలు పంపకుంటే క్రిమినల్ కేసులు పెట్టండి ● కలెక్టర్లకు సిఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు



**హైదరాబాద్,మే12 :** ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ధాన్యం లోడ్ తరలించేందుకు ఒప్పందం మేరకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లను ఉపేక్షించొద్దని.. అవసరమైతే అలాంటి వారిపై క్రిమినల్ కేసులకు వెనకాడవద్దని ముఖ్యమంత్రి ఆదేశించారు. మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడా రైతులకు ఇబ్బందులు కలగొద్దని తెలిపారు. అవసరమైన చోట పోలీస్ సహాయం తీసుకుని కలెక్టర్లు ధాన్యం సేకరణ సాఫీగా జరిగేలా చూడాలని

మిగతా2లో...

# ఆనాటి జైళ్లు దుర్భరంగా ఉండేవి

● బ్రిటిష్ హయాంలో నరక కూపాలుగా జైళ్లు
● తానూ ఎమర్జెన్సీలో జైలుకు వెళ్లి వచ్చా
● చంచల్‌గూడాలో మ్యూజియం, ఫీల్ ది జైల్ ప్రారంభంలో గవర్నర్



**హైదరాబాద్,మే12 :** స్వాతంత్ర్యానికి ముందు జైళ్లు ఎంత అమాన వీయంగా ఉండేవో ప్రజలకు తెలియజేయాల్సి ఉందని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా తెలిపారు. మంగళవారం చంచల్ గూడ జైలులో ఏర్పాటు చేసిన మ్యూజియం, ఫీల్ ది జైల్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ.. స్వాతంత్రానికి పూర్వం జైల్లో గడిపిన వారు ఎలా ఉండేవారనే విషయం ఈ మ్యూజియంను చూస్తే తెలుస్తుం దన్నారు. తెలంగాణ జైళ్ల శాఖ ఆధ్వర్యం లో మ్యూజియం, ఫీల్ ది జైల్ ప్రారంభించడం తనకు చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ మ్యూజియంలో ఉన్నది కేవలం ఇతిహాసానికి సంబంధించిన వస్తువులు కాదన్నారు. స్వాతంత్రానికి ముందు జైళ్లలో ఉన్నవారు ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నారో ఈ మ్యూజియం ద్వారా తెలుస్తుందని చెప్పారు. శిక్షల పేరుతో సంస్కారాన్ని,

మిగతా2లో...

# అసోం సిఎంగా హిమంత బిశ్వశర్మ

● ప్రమాణ కార్యక్రమానికి ప్రధాని హాజరు
● ఎన్‌డి ముఖ్యమంత్రుల్లో చంద్రబాబు రాక






**గౌహతి,మే12 :** అస్సాం ముఖ్యమంత్రిగా హిమంత బిశ్వశర్మ ప్రమాణస్వీకారం చేశారు.అస్సాంలో వరుసగా రెండోసారి సీఎం పదవిని చేపట్టిన తొలి భాజపా నేతగా హిమంత నిలిచారు. ఆయనతో పాటు మరో నలుగురు మంత్రులు ప్రమాణం చేశారు. ఉదయం 11.40 గంటలకు గువాహటిలోని వెటర్నరీ కాలేజీ ఫీల్డ్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. బిశ్వ శర్మతో పాటు బీజేపీ నుంచి ఇద్దరు, ఏజీపీ, బీపీఎఫ్ నుంచి ఒక్కొక్కరు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. అస్సాంలో బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రావడం ఇది వరుసగా మూడోసారి కాగా, అసోం ముఖ్యమంత్రిగా శర్మ పగ్గాలు చేపట్టడం రెండోసారి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, పలువురు కేంద్ర మంత్రులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ సహా పలువురు ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులు హాజరయ్యారు.హిమంత బిశ్వ శర్మతో పాటు రామేశ్వర్ తేలి, అతుల్ బోరా, చరణ్ బోరో,

మిగతా2లో...

# నీట్ ప్రవేశ పరీక్ష రద్దు

## పేపర్ లీక్ వ్యవహారంతో ఎన్‌టిఏ నిర్ణయం

## సిబిఐ విచారణకు ఆదేశించినట్లు వెల్లడి




**న్యూఢిల్లీ,మే12 :** జాతీయ అర్హత పరీక్ష నీట్ యూజీ-2026ను రద్దు చేసారు. పేపర్ లీక్ ఆరోపణలు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. నీట్ పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రం రాజస్థాన్‌లో లీకైనట్లు వచ్చిన వార్తలు పెనుదుమారం రేపాయి. ఈ నేపథ్యంలో జాతీయ పరీక్ష సంస్థ (ఎన్‌టీఏ) కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా మే 3న జరిగిన

మిగతా2లో...

# తమిళనాడు అసెంబ్లీ స్పీకర్‌గా జెసిడి ప్రభాకర్

- డిప్యూటి స్పీకర్‌గా రవిశంకర్ ఎన్నిక



**చెన్నై,మే12 :** తమిళనాడు అసెంబ్లీ స్పీకర్‌గా టీవీకే ఎమ్మెల్యే జేసీడీ ప్రభాకర్ మంగళవారం నాడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీవీకేకు చెందిన మరో ఎమ్మెల్యే రవిశంకర్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక కోసం ఈ సమావేశం ఏర్పాటు చేసినట్టు ప్రోటెం స్పీకర్ ఎంవీ కరప్పయ్య తెలిపారు. తొలుత ప్రభాకర్ నామినేషన్‌ను ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ ప్రతిపాదించారు. ఒకే నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీవంగా స్పీకర్ ఎన్నిక జరిగింది.

మిగతా2లో...

# బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం

- మరింత బలపడే అవకాశం ఉందన్న వాతావరణశాఖ



**విశాఖపట్టణం,మే12 :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కొనసాగుతోంది. రానున్న 48 గంటల్లో ఇది మరింత బలపడే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ద్రోణి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొన్నారు. కోస్తా జిల్లాల్లో వచ్చే ఐదు రోజుల పాటు వానలు పడే అవకాశం ఉన్నట్లు వెల్లడించారు. రాయలసీమ నుంచి తమిళనాడు, కర్ణాటక వరకు ద్రోణి విస్తరించి ఉందని అధికారులు చెప్పారు. మరోవైపు నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఈరోజు ఉదయం 8:30 గంటల సమయానికి అదే ప్రాంతంలో కొనసాగుతోందని ఐఎండీ తెలిపింది. ఇది సముద్ర మట్టానికి సగటున 4.5 కిలోమీటర్ల ఎత్తు వరకూ

మిగతా2లో...

# సనత్‌నగర్ టిమ్స్‌లో వైద్యసేవల ట్రయల్ రన్

వివరాలు 2లో



# కృష్ణా జలాల వినియోగంపై చర్చ

- ఎపికి 10 , తెలంగాణకు 16 టిఎంసిల కేటాయింపు

**హైదరాబాద్,మే12 :** ఏపీ, తెలంగాణ తాగునీటి అవసరాల మేరకు కృష్ణా జలాలను వినియోగించు కోవాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సమావేశంలో నిర్ణయించారు. హైదరాబాద్‌లో జరిగిన కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ సమావేశంలో

మిగతా2లో...

# బిఆర్ఎస్ ముఖ్యనేతలతో కెసిఆర్ భేటీ

- పార్టీ సంస్థాగత నిర్మాణంపై ప్రధానంగా దృష్టి



**గజ్వేల్,మే12 :** బీఆర్ఎస్ ముఖ్య నేతలతో పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ భేటీ దాదాపు ఆరు గంటలుగా కొనసాగింది. ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో కేసీఆర్ వివిధ అంశాలపై పార్టీ నేతలతో సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా పార్టీ సంస్థాగత నిర్మాణం, సభ్యత్వ నమోదు ప్రక్రియ, పార్టీ ఇన్‌ఛార్జ్‌ల నియామకం సహా పార్టీ బలోపేతం వంటి ముఖ్యమైన విషయాలపై కేసీఆర్ అధ్యక్షతన చర్చ జరిగినట్లు సమాచారం. ఈ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా పార్టీ

మిగతా2లో...

# అసోం సిఎంగా హిమంత బిశ్వశర్మ

(మొదటి పేజీ తరువాయి)

అజంతా నియోగ్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో రాష్ట్రాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని, కొత్త టీమ్‌తో కలిసి పూర్తి అంకితభావంతో పటిష్టమైన, మరింత అభివృద్ధి చెందిన, సుసంపన్నమైన అస్సాంను నిర్మిస్తామని శర్మ ప్రకటించారు. హిమంత బిశ్వ శర్మ తొలిసారి 2021లో సీఎంగా ప్రమాణ స్వీకారం చేసారు. బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించి వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చింది. మొత్తం 126 స్థానాల్లో ఎన్డీయే 102 సీట్లు గెలుచుకుంది. బీజేపీ 82 సీట్లు దక్కించుకోగా, భాగస్వామ్య పార్టీలైన ఏజీపీ, బీపీఎఫ్ చెరో 10 సీట్లు గెలుచుకున్నాయి. కాంగ్రెస్ సారథ్యంలోని కూటమికి 19 సీట్లు వచ్చాయి. భాజపా ఒక్కటే 82 సీట్లు గెలుచుకోగా.. దాని కూటమి భాగస్వాములైన ఏజీపీ, బీపీఎఫ్ చెరో 10 సీట్లు దక్కించుకున్నాయి. దీంతో ఎన్డీఏ రాష్ట్రంలో వరుసగా మూడోసారి తమ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. ఈ కార్యక్రమానికి ముందు వేదిక వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తచ్చాడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. తనిఖీ చేయగా అతడి వద్ద తుటాలు లభ్యమయ్యాయి. వెంటనే అనుమానితుడిని బసిస్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టామన్నారు. హిమంత ప్రమాణస్వీకార కార్యక్రమానికి పీఎం మోదీ సహా పలువురు కీలక నేతలు హాజరైన నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

# నీట్ ప్రవేశ పరీక్ష రద్దు

(మొదటి పేజీ తరువాయి)

నీట్ పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. త్వరలోనే కొత్త పరీక్ష తేదీలను వెల్లడిస్తామని తెలిపింది. విద్యార్థుల ప్రయోజనాలు, జాతీయ పరీక్షా వ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని కాపాడేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్‌టీఏ వెల్లడించింది. కొత్త పరీక్ష కోసం విద్యార్థులు మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదని, పరీక్ష ఫీజు చెల్లించనక్కర్లేదని తెలిపింది. పరీక్ష తేదీలను నిర్ణయించిన తర్వాత మళ్లీ అడ్మిట్ కార్డులు విడుదల చేస్తామని పేర్కొంది. ఇక, ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్‌టీఏ తెలిపింది. ఈనెల 3న జరిగిన నీట్ పరీక్షలో కెమిస్ట్రీ విభాగంలో వచ్చిన సుమారు 120కి పైగా ప్రశ్నలతో ఉన్న ఓ ప్రాక్టీసు పేపరును గుర్తించినట్లు రాజస్థాన్ అదనపు డీజీపీ విశాల్ బన్సాల్ వెల్లడించారు. ఈ మెటీరియల్ రాజస్థాన్‌లోని సికార్‌లో పరీక్షకు 42 గంటల ముందు వాట్సాప్‌లో అందుబాటులోకి వచ్చినట్లు గుర్తించారు. ఇందులోని సమాచారం.. నీట్ ప్రశ్నపత్రంలోని 600 మార్కుల ప్రశ్నలతో పోలి ఉండటం గమనార్హం. కొన్ని ప్రశ్నల్లోని జవాబుల క్రమం కూడా అచ్చం ఒకేలా ఉండడం పలు అనుమానాలకు తావిచ్చింది. ఆ ప్రాక్టీసు పేపరు కేరళలోని ఓ వైద్య కళాశాలలో చదువుతున్న ఎంబీబీఎస్ విద్యార్థికి చెందినదిగా దర్యాప్తులో వెల్లడైంది. ఆ వ్యక్తి ఈనెల 1న సికార్‌లోని తన స్నేహితుడికి ఈ మెటీరియల్ ఇచ్చాడని.. ఆ తర్వాత అది పీజీ వసతిగృహాలు, కోచింగ్ నెట్‌వర్క్‌లు, కెరీర్ కౌన్సిలర్లు, పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు చేరిందని అధికారులు తెలిపారు. ఆ మెటీరియల్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీకి సంబంధించిన 300కు పైగా చేతిరాత ప్రశ్నలు ఉన్నాయని వెల్లడించారు. దీనిని విద్యార్థులకు రూ.20వేల నుంచి రూ.2 లక్షల వరకు విక్రయించారని, కొందరు అభ్యర్థుల నుంచి ముందుగానే రూ.30 వేలకు పైగా వసూలుచేశారని గుర్తించామని రాజస్థాన్ పోలీసు అధికారులు పేర్కొన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి ఇప్పటికే పలువురు అనుమానితులను పోలీసులు అరెస్ట్ చేశారు.

# ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం సహించం

(మొదటి పేజీ తరువాయి)

సూచించారు. మంగళవారం.. జిల్లా కలెక్టర్లతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో మొక్కజొన్న కొనుగోలు, వరి ధాన్యం సేకరణపై జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమీక్ష చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సీఎం ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును పరిశీలించాలని.. గన్నీ బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూసుకోవాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటి కప్పుడు గోడౌన్స్‌కు తరలించాలని అన్నారు. ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలను అందుబాటులో ఉండేలా చూడాలని రవాణా శాఖ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు సరైన చర్యలు తీసుకోవాల్సిందే అని.. ప్రతి అధికారి జవాబుదారీ తనంతో వ్యవహరించాల్సిందే అని తేల్చిచెప్పారు. నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపై చర్యలకు ప్రభుత్వం వెనకాడదని హెచ్చరించారు. గోడౌన్స్ సమస్య ఉన్న ప్రాంతాల్లో అవసరాన్నిబట్టి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. రైతుబజార్లు, ఫంక్షన్ హాల్స్‌ను ఎంగేజ్ చేసి ధాన్యాన్ని తరలించాలన్నారు. వెసులుబాటు ఆధారంగా అక్కడినుంచి గోడౌన్స్‌కు తరలించేలా ప్రణాళికలుండాలని తెలిపారు. కొనుగోళ్లపై ఎప్పటికప్పుడు సీఎస్‌కు పోర్ట్ పంపించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ధాన్యం లోడింగ్‌లో జాప్యం జరగకుండా స్థానికంగా ఉన్న హమామీలను గుర్తించి వారితో పని చేయించుకోవాలని రేవంత్ తెలిపారు. ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో లారీల కొరత ఉంటే ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించాలని సూచించారు. అకాల వర్షాల సమయంలో ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. అకాల వర్షాల సమయంలో నష్టం జరగకుండా శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్లకు సూచించారు.

# ఆనాటి జైళ్లు దుర్భరంగా ఉండేవి

(మొదటి పేజీ తరువాయి)

శరీరాన్ని, మనస్తత్వాన్ని విరగ్గొట్టే ప్రయత్నం చేశారని బ్రిటిష్ పాలనలో సాగిన అకృత్యాలను ఆయన వివరించారు.మన కోసం మన పూర్వీకులు పడ్డ కష్టాన్ని తెలుసుకునేందుకు ప్రతి ఒక్కరు ప్రయత్నం చేయాలని ప్రజలకు తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు. విద్యార్థి నాయకుడిగా ఉన్న సమయంలో తాను పలుమార్లు జైలుకు వెళ్లానన్నారు. ఎమర్జెన్సీ సమయంలో 21 రోజులు తాను జైల్లో ఉన్నానని ఆయన గుర్తు చేసుకున్నారు. అప్పుడే జైలు ఎలా ఉంటుందో తనకు తెలిసిందని వివరించారు. గతంలో ఉత్తరప్రదేశ్‌లో కళ్యాణ్ సింగ్ ప్రభుత్వంలో జైళ్ల శాఖ మంత్రిగా తాను పని చేశానని తెలంగాణ గవర్నర్ గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా జైళ్లలో తాను పలు సంస్కరణలు తీసుకొచ్చానని తెలిపారు. ఈ సంస్కరణలతో ఖైదీలు సంతోషం వ్యక్తం చేశారని చెప్పారు. ఈ రోజు మ్యూజియంలో చూసిన దృశ్యాలతో.. మళ్లీ ఆనాటి జ్ఞాపకాలు తనకు గుర్తుకు వచ్చాయన్నారు. ఖైదీలలో ప్రతి ఒక్కరూ క్రిమినల్స్ కాదని.. పరిస్థితులు వారిని ఆ సమయంలో నిందితులుగా మార్చాయని వివరించారు. ఖైదీలలో మార్పు తీసుకురావడానికి అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని జైలు అధికారులకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సూచించారు. మరోసారి తప్పుచేసే ఆలోచన రాకుండా ఖైదీల్లో పరివర్తన తీసుకురావాలని అధికారులకు స్పష్టం చేశారు. సాధారణ ప్రజల కోసం చంచల్‌గూడ జైలు అధికారులు వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. జైలు ఆవరణలో 'జైల్ మ్యూజియం', 'ఫీల్ ది జైల్' పేరుతో ప్రత్యేక బ్లాక్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ప్రారంభించారు. ఇప్పటికే గోవా, కోల్‌కతా వంటి ప్రాంతాల్లో జైలు మ్యూజియాలు ఉన్నాయి. తాజాగా హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలు కూడా ఈ జాబితాలో చేరింది. జైల్ మ్యూజియంలో జైలు చరిత్ర, ఉపయోగించిన పాత వస్తువులు, ఖైదీల జీవితం, శిక్షల విధానాలు వంటి అంశాలను ప్రదర్శించనున్నారు. ఇది విద్యార్థులు, పర్యాటకులు, సాధారణ ప్రజలకు జైలు వ్యవస్థ గురించి అవగాహన కల్పించడానికి ఉపయోగపడనుంది. 'ఫీల్ ది జైల్' బ్యారక్ ద్వారా సాధారణ ప్రజలు ఒకరోజు జైలు జీవితాన్ని అనుభవించేలా జైలు అధికారులు అవకాశం కల్పించారు. ఫీజు చెల్లించి రిజర్వేషన్ చేసుకున్నవారు జైలు రూల్స్ ప్రకారం ఒక రోజు బ్యారక్‌లో ఉండి, జైలు ఆహారం, రొటీన్ కార్యకలాపాలు, శిక్షల వాతావరణాన్ని అనుభవించవచ్చు. ఇది జైలు జీవితం ఎంత కష్టమో అర్థం చేసుకోవడానికి

# సనత్‌నగర్ టిమ్స్‌లో వైద్యసేవల ట్రయల్ రన్

**స్వయంగా పరిశీలించిన మంత్రి దామోదర**

**జూన్‌లో ప్రారంభిస్తామని వెల్లడి**

**హైదరాబాద్,మే12 :** సనత్‌నగర్ టిమ్స్‌లో జరుగుతున్న వైద్య సేవల ట్రయల్ రన్‌ను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పరిశీలించారు. హాస్పిటల్ బ్లాకులన్నీ మంత్రి కలియ తిరిగారు. ఓపీ రిజిస్ట్రేషన్, ఐపీ వార్డులు, ఎమర్జెన్సీ డిపార్ట్ మెంట్, సీటీ స్కాన్, ఎంఆర్ఐ, ల్యాబులు, మెకనైజ్‌డ్ ల్యాండ్రీ, కిచెన్ తదితర అన్ని డిపార్ట్‌మెంట్లను మంత్రి పరిశీలించారు. పెండింగ్ పనులన్నీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ, ఆరోగ్యశాఖ అధికారులకు మంత్రి సూచించారు. హాస్పిటల్‌కు నీళ్లు, పవర్ సప్లైలో ఎలాంటి ఆటంకం ఉండకూడదని, 24 గంటల సరఫరా ఉండాలని మంత్రి సూచించారు. ఫైర్ సేఫ్టీ విషయంలో రాజీ ఉండకూడదని, అన్ని ఫ్లోర్లలో మరోసారి పూర్తిస్థాయి పరిశీలన చేయాలని అధికారులను ఆదేశించారు. రిసెప్షన్ ఏరియా, హెల్ప్ డెస్క్, ఓపీ కౌంటర్లు, వెయిటింగ్ హాల్, ఓపీ కన్సల్టేషన్ రూమ్స్, డయాగ్నస్టిక్స్, ఇన్ పేషెంట్ వార్డులు, ఫార్మసీ తదితర ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి.. రిజిస్ట్రేషన్ కౌంటర్స్, ఫార్మసీ కౌంటర్స్ పెంచాలని మంత్రి సూచించారు.



సీటీ స్కాన్, ఎంఆర్ఐ, ఎక్స్ రే, ఆల్ట్రాసౌండ్ తదితర యంత్రాలను పరిశీలించిన మంత్రి.. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ యంత్రాలు పూర్తిస్థాయిలో పేషెంట్లకు ఉపయోగపడాలని, ఇందుకు అవసరమైన డాక్టర్లు, ఇతర సిబ్బందిని సిద్ధంగా ఉంచుకోవాలని ఆరోగ్యశాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రారంభం నాటికి అన్ని సౌకర్యాలతో హాస్పిటల్‌ను సిద్ధం చేయాలని, పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పని చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. జూన్‌లో సనత్‌నగర్ టిమ్స్‌ను ప్రారంభిస్తామని అన్నారు. ఇక్కడ సక్సెస్‌ఫుల్‌గా వైద్య సేవల ట్రయల్ రన్ జరుగుతోంది.కొన్ని ఫినిషింగ్ వర్క్స్ జరుగుతున్నాయి. ఆ పనులన్నీ గడువులోగా పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ, ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించామన్నారు. ఇది వెయ్యి బెడ్ల హాస్పిటల్, ఇందులో 300 ఎమర్జెన్సీ బెడ్లు ఉంటాయి. అత్యవసర పరిస్థితుల్లో బాధితుల ప్రాణాలు నిలిపే గొప్ప హాస్పిటల్‌గా దీన్ని తీర్చిదిద్దుతున్నాం. గుండె సంబంధిత వ్యాధుల చికిత్సలు, ఆర్గాన్ ట్రాన్స్‌ప÷లాంటేషన్ సర్జరీలకు ఈ హాస్పిటల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ఉంటుందని వివరించారు. ఇక్కడే అద్భుతమైన రీసెర్చ్ సెంటర్ అందుబాటులోకి తీసుకొస్తాం అని దామోదర అన్నారు.

# తమిళనాడు అసెంబ్లీ స్పీకర్‌గా జెసిడి ప్రభాకర్

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం ప్రోటెం స్పీకర్‌గా తన పాత్ర ముగిసినట్టు కరుప్పయ్య ప్రకటించారు. ఆ వెంటనే సభాసాంప్రదాయం ప్రకారం స్పీకర్ ప్రభాకర్‌ను ఆయన చైర్ వరకూ సభానేత కేఏ సెంగోట్టియన్, ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ తోడ్కొని వెళ్లారు. ఆయనకు అభినందనలు తెలిపారు. స్పీకర్‌గా ప్రభాకర్ బాధ్యతలు చేపట్టిన వెంటనే డిప్యూటీ స్పీకర్ ఎన్నికను చేపట్టారు. డిప్యూటీ స్పీకర్ పదవికి తురైయూర్ టీవీకే ఎమ్మెల్యే ఎం.రవిశంకర్ ఒక్కరే నామినేషన్ వేశారని, దీంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైందని ప్రభాకర్ ప్రకటించారు. రవిశంకర్ నామినేషన్‌ను సెంగోట్టియన్ ప్రతిపాదించారు.

# బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం

(మొదటి పేజీ తరువాయి)

సాధారణంగా ఉంటుందని చెప్పింది. ఈ వారం చివరి నాటికి దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ సముద్రం, అండమాన్ అండ్ నికోబార్ దీవుల్లోని కొన్ని ప్రాంతాల్లో నైరుతి రుతుపవనాల ప్రవేశానికి పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయని ఐఎండీ తెలిపింది. ఓ ప్రకటన జారీ చేసింది.

# కృష్ణా జలాల వినియోగంపై చర్చ

(మొదటి పేజీ తరువాయి)

ఇరు రాష్ట్రాల ఈఎన్‌సీలు, ఉన్నతాధి కారులు పాల్గొన్నారు. సాగర్‌లో ఆగస్టు 15 వరకు ఏపీకి 10 టీఎంసీల వినియోగానికి కేఆర్ఎంబీ అనుమతించింది. తెలంగాణకు సాగర్ నుంచి 16, శ్రీశైలం నుంచి 6 టీఎంసీల వినియోగానికి అంగీకారం తెలిపింది. ఏపీ ఇప్పటికే ఎక్కువ నీరు వాడుకుందని సమావేశంలో తెలంగాణ అధికారులు కేఆర్ఎంబీ దృష్టికి తీసుకెళ్లారు.

# బిఆర్ఎస్ ముఖ్యనేతలతో కెసిఆర్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన కార్యదర్శులు, మండలి, శాసనసభా పక్షాల ఉపనాయకులు పాల్గొన్నారు. అలాగే అసెంబ్లీ డిప్యూటీ ఎలోర్ లీడర్లు హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, శాసన మండలి ఫ్లోర్ లీడర్ సిరికొండ మధుసూదనాచారి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు ఎల్.రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు ఉన్న గ్రామ, మండల, జిల్లా స్థాయి కమిటీల రద్దుపైనా సుదీర్ఘ చర్చ కొనసాగినట్లు తెలుస్తోంది. ఈ కమిటీల స్థానంలో కొత్త కమిటీలను ఎన్నుకోవాలని కేసీఆర్ ఆదేశించినట్లు సమాచారం. కమిటీల్లో పార్టీ కోసం కష్టపడి పని చేసే యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ, జీహెచ్ఎంసీ ఎన్నికలపైనా నేతలతో కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల తెలంగాణ పర్యటనపైనా కేసీఆర్ ఆరా తీస్తున్నట్లు సమాచారం. బండి సంజయ్ కుమారుడి కేసు వ్యవహారం కూడా చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ అంశం గురించి కేసీఆర్‌కు బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ వివరించినట్లు సమాచారం. కొత్తగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపైనా బీఆర్ఎస్ నేతలతో కేసీఆర్ చర్చించారు. అలాగే ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై బలంగా పోరాటాలు చేయాలని నేతలను కేసీఆర్ ఆదేశించినట్లు తెలుస్తోంది. ప్రధానంగా పార్టీ బలోపేతం, కొత్త కమిటీల నియామకంపై దృష్టి సారించారు.

# భగీరథకు సిట్ నోటీసులు

**• నేడు విచారణకు రావాలని ఆదేశం**



**హైదరాబాద్,మే12 :** కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం భగీరథ్‌కు నోటీసులు జారీ చేసింది. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు విచారణకు హాజ రు కావాలని సిట్ అధికారులు ఆదేశించారు. సిట్ అధికారులు బుధవారం పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో భగీరథ్‌ను విచారించనున్నారు. ఈ కేసుకు సంబంధించిన పలు అంశాలపై ప్రశ్నించే అవకాశం ఉన్నట్లు సమాచారం. బాధితురాలి స్టేట్‌మెంట్ నమోదు చేసిన అనంతరం పోలీసులు ఈ కేసులోని సెక్షన్లను మార్చారు. గతంలో నమోదు చేసిన పోక్సో యాక్ట్ సెక్షన్లను సవరించారు.

# జూన్ 2న ఇందిరమ్మ ఇళ్ల రెండోవిడుత పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలో పొంగులేటి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. నెల 21న జరిగే కేబినెట్ సమావేశంలో విధివిధానాలు ఖరారు అయ్యాయని, ఇందిరమ్మ ఇళ్ల కోసం స్థలాలు గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు లబ్ధిదారులకు ఇచ్చేందుకు స్పెషల్ డ్రైవ్ చేస్తున్నామని, క్యూర్ పరిధిలో 5 నుంచి 8 కి.మీ. పరిధిలో ఇందిరమ్మ ఇళ్లు కేటాస్తామని, ఈ నెల చివరిలోగా హైదరాబాద్ లో ఇళ్ల స్థలాలు కలిగిన వారికి ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు. నియోజక వర్గం యూనిట్ గా స్థలాలు గుర్తించామని, అంగుళం ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైనా సహించేది లేదని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు.

# తెలంగాణ-కర్ణాటక సరిహద్దులో ఘోర బస్సు రోడ్డు ప్రమాదం.. ఐదుగురు మృతి



**బీదర్, మే12 :** తెలంగాణ-కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బీదర్-జహీరాబాద్ రోడ్డుపై అదుపుతప్పిన కర్ణాటక ఆర్టీసీ బస్సు.. బైక్‌ను ఢీకొట్టి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు పూర్తిగా ధ్వంసమైంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఐదుగురు ప్రయాణికులు.. అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఘటన జరిగిన వెంటనే సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు.. సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని బీదర్ ఆస్పత్రికి తరలించారు. మృతి చెందిన వారిలో ఇద్దరు సంగారెడ్డి జిల్లా నాల్కల్ కు చెందిన వారిగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ఆర్టీసీ బస్సు.. బీదర్ నుండి హైదరాబాద్ కు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిపై దాడి నిందితుడి అరెస్ట్



**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో, మే 12 (పీపుల్స్ న్యూస్) :** గోషామహల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ విధుల్లో ఉన్న పోలీస్ అధికారిపై దాడికి పాల్పడి, విధి నిర్వహణకు ఆటంకం కలిగించిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం....... మే 11, 2026 రాత్రి సుమారు 8:10 గంటల సమయంలో బాధితుడైన ట్రాఫిక్ పోలీస్ అధికారి లేబర్ అడ్డా సమీపంలో తన విధులను నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో బహదూర్‌పురా, మురళీ నగర్ కు చెందిన నిందితుడు వేద్ ప్రకాష్ మిట్టల్(47) తన కుమారుడితో కలిసి హోండా యాక్టివా (టీఎస్ 12 ఈటి 2874)పై అక్కడికి వచ్చాడు. ట్రాఫిక్ నిలిపివేసిన విషయంలో పోలీసు అధికారితో వాగ్వాదానికి దిగి, దుర్భాషలాడుతూ అతని ముఖం , శరీరంపై పిడిగుద్దులతో దాడికి పాల్పడ్డాడు. అంతేకాకుండా, వేద్ ప్రకాష్ తన వద్ద ఉన్న 5 లీటర్ల వాటర్ క్యాన్‌తో అధికారిపై దాడి చేసి గాయపరిచాడు. ఘటన జరిగిన వెంటనే అక్కడే ఉన్న ఇతర విధి నిర్వహణ అధికారులు , ప్రజల సహాయంతో నిందితుడు వేద్ ప్రకాష్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని కుమారుడు (సీసీఎల్) ఘటనా స్థలం నుండి పరారైనప్పటికీ, తదుపరి దర్యాప్తులో పోలీసులు అతనిని కూడా పట్టుకున్నారు. నిందితుల వద్ద నుండి దాడికి ఉపయోగించిన నీలిరంగు ఖాళీ వాటర్ క్యాన్, హోండా యాక్టివా వాహనం , ఒక మోటో జీ34 స్మార్ట్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం నిందితుడు వేద్ ప్రకాష్‌ను న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించగా, బాలుడిని (సీసీఎల్ ) నిబంధనల ప్రకారం జిల్లా ప్రొబేషన్ ఆఫీసర్ (డీపీఓ) ముందు హాజరుపరుస్తున్నారు. హైదరాబాద్ సిటీ పోలీస్ హెచ్చరిక: ప్రభుత్వ ఉద్యోగులు తమ విధులను నిర్వహిస్తున్నప్పుడు వారిపై దాడులకు పాల్పడటం లేదా ఆటంకం కలిగించడం తీవ్రమైన నేరమని, ఇటువంటి చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడే వారిపై కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని గోల్కొండ జోన్ డిసిపి జి. చంద్ర మోహన్ హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణ , ప్రజల భద్రత కోసం హైదరాబాద్ సిటీ పోలీస్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

# నకిలీ నంబర్ ప్లేట్ వాడుతున్న వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదు.





ORIGINAL VEHICLE No. MH04KW7706

FAKE VEHCILE No.MH04KW7706
(THE CASE IS UNDER INVESTIGATION TO ASCERTAIN THE ACTUAL VEHICLE NUMBER)

**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో, మే 12 (పీపుల్స్ న్యూస్) :** నకిలీ నంబర్ ప్లేట్ వాడుతున్న వ్యక్తిపై అత్తాపూర్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనల తనిఖీల్లో భాగంగా, హైదరాబాద్ సిటీ ట్రాఫిక్ పోలీసులు నకిలీ నంబర్ ప్లేట్‌ను ఉపయోగిస్తున్న ఒక వ్యక్తిని గుర్తించారు. ఈ సమాచారం ఆధారంగా అత్తాపూర్ పోలీసులు రంగంలోకి దిగి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. రాజేంద్రనగర్ పరిధిలోని ఉప్పర్‌పల్లిలో నివసిస్తున్న నిందితుడు సయ్యద్ రిజ్వాన్ అలీ (28) తన హ్యుందాయ్ క్రెటా వాహనానికి ట్రాఫిక్ చలాన్ల నుండి తప్పించుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వ అధికారులను, పోలీసులను తప్పుదోవ పట్టిస్తూ ఎంహెచ్ 04కెడబ్ల్యు7706 అనే నకిలీ నంబర్ ప్లేట్‌ను ఉపయోగిస్తున్నాడు. ఇతను చేసిన ట్రాఫిక్ ఉల్లంఘనల వల్ల, ఆ నంబర్ గల అసలు వాహన యజమాని ముంబై నివాసి యశ్ మనోజ్ పాల్‌రేచాపై అన్యాయంగా చలాన్లు నమోదవుతున్నాయి. దీనిపై అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నిందితుడికి నోటీసు జారీ చేసి, అసలు వాహనం నంబర్‌ను కనుగొనేందుకు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నకిలీ, వేరొకరి నంబర్ ప్లేట్ లేదా మార్చిన నంబర్ ప్లేట్లను ఉపయోగించడం తీవ్రమైన నేరమని, అటువంటి వారిపై బీఎన్ఎస్ , మోటారు వాహనాల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. నకిలీ నంబర్ ప్లేట్లను గుర్తించేందుకు సీసీటీవి నిఘా ఎఎన్పీఆర్ (ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్) వంటి అత్యాధునిక సాంకేతికతను ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. మీ వాహనం నంబర్ ప్లేట్ దుర్వినియోగం అవుతున్నట్లు అనుమానం ఉంటే వెంటనే వెబ్‌సైట్: https://echallan.tspolice.gov.in, echallanhelpdesk.hyd@gmail.com,వాట్సాప్ నంబర్: 8712661690 కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

# జిల్లా స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించడం భౌరంపేట్ ప్రాంతానికి గర్వకారణం

**భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి.**








**కుత్బుల్లాపూర్, మే 12 (పీపుల్స్ న్యూస్) :** జిల్లా స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించడం భౌరంపేట్ ప్రాంతానికి గర్వకారణమని భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఇటీవల విడుదలైన 10వ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించి తమ తల్లిదండ్రులకు, పాఠశాలలకు, ప్రాంతానికి మంచి పేరు తీసుకువచ్చిన విద్యార్థులను మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి శాలువాతో సన్మానించి, నగదు పురస్కారాన్ని అందచేసారు. అనంతరం భౌరంపేట్‌కు చెందిన ఒక విద్యార్థి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించడం పట్ల కార్యక్రమంలో ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థి లక్ష్మీ నారాయణకు రూ.50,000 నగదు పురస్కారం అందజేశారు. అలాగే మండల స్థాయిలో 3వ ర్యాంక్ సాధించిన విద్యార్థికి రూ.30,000 నగదు బహుమతిని ప్రదానం చేశారు. అదేవిధంగా 500 పైగా మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున, 490 పైగా మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5,000 చొప్పున నగదు పురస్కారాలను అందజేసి వారి ప్రతిభను కొనియాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత స్థాయిలో ఉండాలని మన స్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలియజేసారు. ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం సమాజ బాధ్యత అని, భవిష్యత్తులో కూడా విద్యార్థులకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామిరెడ్డి, నాయకులు మన్నే శేఖర్ ముదిరాజ్,మిద్దెల మల్లారెడ్డి,కటకం విరేష్,ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ములుగులో హౌస్ లిస్టింగ్ పనులను పరిశీలించిన

**సెన్సస్ జాయింట్ డైరెక్టర్ సుబ్బారాజు.**





**ములుగు జిల్లా ప్రతినిధి మే 12 (పీపుల్స్ న్యూస్)**ములుగు మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న జనగణన హౌస్ లిస్టింగ్ మొదటి విడత పనులను హైదరాబాద్ సెన్సస్ ఆపరేషన్స్ జాయింట్ డైరెక్టర్ సుబ్బారాజు మంగళవారం పరిశీలించారు. మున్సిపాలిటీలోని సూపర్‌వైజర్ సర్కిల్‌లో సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్లు ఇంటి నంబర్లను ఎలా కేటాయిస్తున్నారో, పని సక్రమంగా జరుగుతుందో లేదో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రతి ఇంటి నంబర్ ఎదురుగా "సి ఎన్" అని తప్పనిసరిగా రాయాలని, అపాయింట్మెంట్ ఆర్డర్లు వచ్చాయో లేదో, మ్యాపింగ్ ఎలా చేస్తున్నారో కూడా ఆయన ఆరా తీశారు. పనుల్లో వేగం పెంచాలని, తప్పులు లేకుండా చూడాలని మున్సిపాలిటీ ఛార్జ్ అధికారికి తగిన సూచనలు ఇచ్చారు. ఎన్యూమరేటర్లకు కేటాయించిన హౌస్ లిస్టింగ్ బ్లాక్ హెచ్ ఎల్ బి పరిధిని స్పష్టంగా తెలియజేసేందుకు మున్సిపాలిటీ నుంచి మూడు రోజుల పాటు సిబ్బందిని వారి వెంట పంపించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు 13.05.2026 సాయంత్రం లోపు తమకు కేటాయించిన ప్రతి ఇంటికి ఇంటి నంబర్లు పూర్తి చేయాలని సూచించారు. జూన్ 9 వరకు ఈ పని కొనసాగుతుందని, అందరూ అదే స్ఫూర్తితో పని చేయాలని ఛార్జ్ అధికారులు, అడిషనల్ ఛార్జ్ అధికారులను కోరారు. రోజువారీ పనితీరుపై మానిటరింగ్ చేయాలని కూడా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెన్సస్ ఇంచార్జ్ వినయ్,ములుగు సీపీవో జిల్లా సెన్సస్ అధికారి ఎం. ప్రకాష్,మున్సిపాలిటీ చార్జ్ ఆఫీసర్ కమిషనర్ సంపత్, స్టాటిస్టికల్ ఆఫీసర్ బి.లాల్ నాయక్,ఫీల్డ్ ట్రైనర్లు, సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

# ప్రయాణికులకు మౌలిక వసతులు కల్పించాలి.

**వేసవి కాలం దృష్ట్యా జిల్లా కేంద్రం లో చలివేంద్రాల సంఖ్య పెంచాలి**
**జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు**








**ములుగు జిల్లా ప్రతినిధి మే 12 (పీపుల్స్ న్యూస్):**బస్ స్టాండ్ ఆవరణలో ప్రయాణికులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, వేసవి కాలం దృష్ట్యా మున్సిపాలిటీ పరిధిలో మరిన్ని చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు మంగళవారం జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు ములుగు జిల్లా తాత్కాలిగ బస్టాండ్ ఆవరణ పరిసరాలను,ములుగు మున్సిపాలిటీ పరిధిలో పట్టణ ప్రకృతి వనాన్ని, చలి వేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లా తాత్కాలిక బస్ స్టాండ్ ఆవరణ పరిసరాలను పరిశీలించి బస్సుల సమయపాలన,వసతుల కల్పన పలు అంశాలను అడిగి తెలుసుకొని తప్పనిసరిగా ప్రయాణికులకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. పట్టణ ప్రకృతి వనాన్ని పరిశీలించి మొక్కలు ఎండి పోకుండా సమృద్ధిగా నీరు అందించాలన్నారు. వేసవి కాలంలో దృష్టిలో ఉంచుకొని ప్రజలు రద్దీ ఉండే ప్రదేశాలలో మరిన్ని చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో మున్సిపాలిటీ కమిషనర్ జనగాం సంపత్ రెడ్డి,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చదువే ఉన్నత శిఖరంలోకి నిలబెడుతుంది

**పుట్టిన ఊరు పేరు నిలబెట్టాలి**
**మండల విద్యాధికారి వజ్జా తిరుపతి**
**సర్వాపురం గ్రామపంచాయతీలో టెన్త్ ఇంటర్ మెరిట్ విద్యార్థులకు ఆత్మీయ సన్మానం**








**ములుగు జిల్లా ప్రతినిధి మే 12( పీపుల్స్ న్యూస్)**ములుగు (:సర్వాపూర్) ములుగు మండలం లోని సర్వాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం లో మెరిట్ విద్యార్థులకు అభినందనఆత్మీయ సన్మానకార్యక్రమం సర్పంచ్ ఈక కుమార్ గారి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మండల విద్యాధికారి వజ్జా తిరుపతి గారు మాట్లాడుతూ పట్టుదలతో చదువుతూ ఉన్నత శిఖరాలను అందుకోవాలని అన్నారు. పై చదువులకు మొదటి మెట్టు పదవ తరగతి ఇంటర్మీడియట్ అన్నారు. ఈతరగతులలో పట్టుదలతో చదివి భవిష్యత్తు పునాదికి నాంది పలకాలన్నారు. చదువుకు పేదరికం అడ్డు రాదని నిరూపించాలని అన్నారు. సమాజంలో దేనికి లేని గుర్తింపు కేవలం చదువుకే అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు గుండెబోయిన రవిగౌడ్ వార్డ్ మెంబర్స్ గుండె బోయిన రజిత పేనుక కృష్ణ సర్వాపూర్ పాఠశాల హెడ్మాస్టర్ కేదారి రాయిని గూడెం పాఠశాల హెడ్మాస్టర్ వాంకుడోత్ జ్యోతి ప్రజాసంఘాల నాయకులు గుండమీది వెంకటేశ్వర్లు గుండెబోయిన శ్రీహరి గౌడ్. యాపవెంకన్న నాలి సాంబయ్య. దోబే కుమార్ పంచాయతీ కార్యదర్శి లక్ష్మన్. పేనుక సుజాత నాలి స్వర్ణ లత. పిడబోయిన నాగేంద్ర బాబు తో పాటు 30 మంది మెరిట్ విద్యార్థులు పేరెంట్స్ పాల్గొన్నారు.

# ములుగు సాంస్కృతిక వైభవం ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

**మూడు రోజుల పాటు ఉత్సవాల నిర్వహణ.**
**జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు.**





**ములుగు జిల్లా ప్రతినిధి మే 12 (పీపుల్స్ న్యూస్)**ములుగు సాంస్కృతిక వైభవం ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, మూడు రోజుల పాటు ఉత్సవ కార్యక్రమాలు జరగనున్నాయని జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు ములుగు సాంస్కృతిక వైభవం ఉత్సవాల నిర్వహణపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి ఉత్సవాల షెడ్యూల్, రిజిస్ట్రేషన్ ప్రక్రియ, ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా విశిష్ట సంస్కృతి, సంప్రదాయాలను, ప్రతిబింబించేలా ములుగు సాంస్కృతిక వైభవం ఉత్సవాలను అత్యంత వైభవోపేతంగా ఘనంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో, జడ్.పి.హెచ్.ఎస్ బాలుర పాఠశాల, జడ్.పి.హెచ్.ఎస్. బాలికల పాఠశాలలో మే 20,21,22వ తేదీలలో మూడు రోజులపాటు క్రీడలు, సంస్కృతిక కార్యక్రమాలు, ఫుడ్ స్టాల్స్, గిరిజన నృత్యాలు, కవి సమ్మేళనం పలు అంశాలలో ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాలు నిర్వహించే వేదికలను ఎప్పటికప్పుడు శుభ్రపరిచే విధంగా చూడాలని, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, వంటి అంశాలలో ఎలాంటి లోటుపాట్లు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, ఆర్డీవో వెంకటేష్, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చోరీ కేసును 24 గంటల్లోనే ఛేదించిన గోషామహల్ పోలీసులు








**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో, మే 12 (పీపుల్స్ న్యూస్) :** గోషామహల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన భారీ చోరీ కేసును పోలీసులు కేవలం 24 గంటల వ్యవధిలోనే ఛేదించి, దొంగిలించబడిన రూ. 5 లక్షల నగదుతో పాటు భారీగా బంగారం,వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం......... ఈ నెల 10వ తేదీన డి. మహేష్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఒక వేడుకకు హాజరయ్యేందుకు ఇంటికి తాళం వేసి వెళ్లారు. అర్ధరాత్రి తిరిగి వచ్చేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉండటం, అల్మారాలు పగులగొట్టి ఉండటం గమనించారు. ఇంట్లోని రూ. 5 లక్షల నగదుతో పాటు సుమారు 30 తులాల బంగారు ఆభరణాలు మరియు 1.62 కిలోల వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై గోషామహల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు . దర్యాప్తులో భాగంగా బేగం బజార్ ముల్తానీపురాకు చెందిన దొంతుల రాజేష్ (37)గా నింధితుడిని గుర్తించారు. నిందితుడు బాధితుడికి వరుసకు సోదరుడు (కజిన్) కావడమే కాకుండా, పక్క ఇంట్లోనే నివసిస్తున్నాడు. కిరాణా దుకాణం నిర్వహిస్తూ, ఆటో నడుపుతున్న రాజేష్, ఆన్లైన్ లోన్ యాప్‌ల ద్వారా తీసుకున్న అప్పులు,ఇతర ఆర్థిక ఇబ్బందుల నుండి బయట పడటానికి తన సోదరుడి ఇంట్లోనే చోరీ చేయాలని పథకం వేశాడు. బాధితుడి భార్య వేడుకల్లో ధరించే భారీ బంగారు ఆభరణాలపై కన్నేసిన నిందితుడు, కుటుంబ సభ్యుల కదలికలను నిరంతరం గమనిస్తూ వచ్చాడు. మే 10వ తేదీన మహేష్ కుటుంబ సభ్యులంతా లంగర్ హౌస్‌లోని ఒక వేడుకకు వెళ్లడాన్ని రాజేష్ గమనించాడు. రాత్రి 9:30 గంటల సమయంలో పక్కనే ఉన్న మరో పొరుగు ఇంటికి పాలు ఇచ్చే నెపంతో వెళ్లిన నిందితుడు, అక్కడి నుండి ఎవరికీ అనుమానం రాకుండా డాబా పైకి ఎక్కి బాధితుడి ఇంట్లోకి ప్రవేశించాడు. స్క్రూడ్రైవర్ సహాయంతో రెండో , మూడో అంతస్తుల తలుపులు పగులగొట్టి, అల్మారాలోని నగదు, బంగారం, వెండి వస్తువులను ఒక చిన్న సంచిలో వేసుకుని తన ఇంట్లో దాచిపెట్టాడు. ఏమీ తెలియనటు్లగా ఆ తర్వాత తన ఆటో తీసుకుని బయటకు వెళ్లిపోయాడు. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుండి రూ. 5 లక్షల నగదు, ఒక టైటాన్ వాచ్, 30 తులాల బంగారు ఆభరణాలు (లాంగ్ చైన్, లక్ష్మీ డిజైన్ నెక్లెస్, కమ్మలు, బుట్టలు, ముక్కుపుడకలు, గోల్డ్ బిస్కెట్ మొదలైనవి), 1.62 కిలోల వెండి వస్తువులు (కడియాలు, పట్టీలు, దీపాలు, గిన్నెలు) , కాంస్య వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. గోల్కొండ జోన్ డిసిపి జి. చంద్ర మోహన్ ఆదేశాల మేరకు, గోషామహల్ ఏసిపి కె. చంద్రశేఖర్ రెడ్డి పర్యవేక్షణలో, గోషామహల్ ఇన్స్‌పెక్టర్ బి. శ్రావణ్ కుమార్, డిటెక్టివ్ సబ్ ఇన్స్పెక్టర్ అజిత్ సింగ్ బైర్వా సిబ్బంది ఈ కేసును అత్యంత వేగంగా ఛేదించారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన అధికారులను, సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

# చైన్ స్నాచర్ కు నిందితుడికి 5 ఏళ్ల జైలు శిక్ష, 25,000 జరిమానా.




**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో, మే 12 (పీపుల్స్ న్యూస్) :** మహిళ మెడలో గొలుసును లాక్కెళ్లిన నిందితుడికి 5 ఏళ్ల జైలు శిక్ష తో పాటు రూ. 25,000 జరిమానా విధించారు. షాహాలిబండ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి. మహేష్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం..... 2018 జూలై 24న పాతర్‌కీ దర్గా సమీపంలో ఒక మహిళ మెడలోని బంగారు గొలుసును నిందితుడు ముత్తు హరి కృష్ణ లాక్కొని పరారయ్యాడు. ఈ ఘటనపై షాహాలిబండ పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని చాకచక్యంగా పట్టుకుని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుండి దొంగిలించిన బంగారు గొలుసు తో పాటు నగదును స్వాధీనం చేసుకున్నారు. డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ బి. నరసింహ సంజయ్ రెడ్డి ఈ కేసులో సమగ్ర దర్యాప్తు నిర్వహించి, కోర్టులో పటిష్టమైన సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టారు. వాదనలు విన్న 16వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ జి. ప్రభాకర్ నిందితుడు ముత్తు హరి కృష్ణను దోషిగా నిర్ధారిస్తూ, 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష తొ పాటు రూ. 25,000 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. సకాలంలో దర్యాప్తు పూర్తి చేసి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అధికారులను , సిబ్బందిని ఎస్‌హెచ్‌ఓ అభినందించారు. ఈ సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానిత వ్యక్తుల సమాచారాన్ని వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఇన్‌స్పెక్టర్ పి. మహేష్ గౌడ్ సూచించారు.

# కేంద్రమంత్రి నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలి: ఎన్ఎఫ్ఐ డబ్ల్యు, సీపీఐ

**వనపర్తి,మే 12 (పీపుల్స్ న్యూస్):** కరీంనగర్ లో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కొడుకు సాయి భగీరథ మైనర్ బాలికపై లైంగిక దాడికి నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి పదవికి రాజీనామా చేయాలని ఎన్ఎఫ్ఐ డబ్ల్యు జిల్లా అధ్యక్షులు, కేతేపల్లి ఉప సర్పంచ్ కృష్ణవేణి, ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యూ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షురాలు మాజీ సర్పంచ్ కళావతమ్మ, సిపిఐ జిల్లా కార్యదర్శి కే శ్రీరామ్, సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. పానగల్ మండలం కేతేపల్లి బస్టాండ్ లో బండి సాయి భగీరథ్ మైనర్ బాలికపై లైంగిక దాడికి ఎన్ఎఫ్ఐ డబ్ల్యు, సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళలను పూజించే గౌరవించే దేశం మనదని, సనాతన ధర్మాన్ని కాపాడుతామని బిజెపి నేతలు గొప్పలు చెబుతారని, ఆచరణలో నీచంగా వ్యవహరిస్తారని విమర్శించారు.కరీంనగర్ లో మైనర్ బాలికపై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడి దురాగతం దీనికి తాజా ఉదాహరణ అన్నారు. బిజెపి పాలిత మణిపూర్ రాష్ట్రంలో గతంలో ఇద్దరుమహిళలను నగ్నంగా ఊరేగించారని గుర్తు చేశారు. ఆర్ఎస్ఎస్ నేపథ్యంలో ఎదిగిన బండి సంజయ్ తన కుమారుడికి సత్ప్రవర్తన నేర్పించడంలో ఎందుకు విఫలమయ్యారని ప్రశ్నించారు. తండ్రిగా కుమారునికి సత్ప్రవర్తన నేర్పించడంలో వైఫల్యానికి ఆయన నైతిక బాధ్యత వహించాన్నారు. లైంగిక దాడిపై బాలిక కుటుంబ సభ్యులు సాయి భగీరథ పై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఫోక్సో కేసు నమోదు చేసినా ఇంత



వరకు ఎందుకు అరెస్టు చేయలేదన్నారు. సామాన్యుల పిల్లలు లైంగిక దాడి నేరానికి పాల్పడితే ఫోక్సో కేసు పెట్టి, వెంటనే నిందితులను అరెస్టు చేస్తారని దొరకకపోతే తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్లో కూర్చోబెడతారని మరి బండి సంజయ్ కుమారుని అరెస్ట్ చేయకుండా పోలీసులు ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. సామాన్యుడికి ఒక నీతి ఉన్నత పదవుల్లో ఉన్న వారికి మరొక నీతా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా సాయి భగీరథ అరెస్టుపై ఆలస్యాన్ని ఖండించారు. బాధ్యత గల కేంద్ర మంత్రిగా తన కొడుకును పోలీసులకు సరెండర్ చేయాలని లేదా నైతిక బాధ్యత వహించి కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేయాలన్నారు. రాజీనామా చేయకుంటే ప్రధాని జోక్యం చేసుకొని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. సాయి భగీరథ కూడా తనపై హానీ ట్రాప్ జరిగిందని పోలీస్ స్టేషన్లో బాలిక కుటుంబంపై ఫిర్యాదు చేశారని ఇంతకంటే దారుణం మరొకటి ఉండదన్నారు. ఇది కేసును తప్పుదారి పట్టించే ప్రయత్నం అని, సాయి భగీరథను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని లేదంటే సిపిఐ, అనుబంధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎన్ఎఫ్ఐ డబ్ల్యు ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షురాలు కళావతమ్మ ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు శ్రీరామ్ సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్ ,సిపిఐ మండల కార్యదర్శి డంగు కుర్మయ్య, మాజీ వార్డు సభ్యుడు కమ్మావులపెంటయ్య ,వార్డు మెంబర్ మాల కురువమ్మ, సిపిఐ కేతపల్లి గ్రామ శాఖ కార్యదర్శికాకం చిన్న నారాయణ, కాకం కాశన్న, రామాంజనేయులు, బాలస్వామి, ఎల్లయ్య, ఎల్లమ్మ, రామదాసు, కాకం కాశన్న, నీలమ్మ ,బొక్కలమ్మ, సాయి లీల ,బోయ చిన్న కుర్మయ్య ,బీరయ్య, ధర్మయ్యతదితరులు పాల్గొన్నారు.

# గుంటూరు రైల్వే గేట్ సమీపంలో కలకలం – దోపిడీ దొంగలపై జీఆర్పీ పోలీసుల కాల్పులు

**గుంటూరు జిల్లా:** పొన్నూరు రైల్వే స్టేషన్ సమీపంలో తెల్లవారుజామున ఉద్రిక్తత చోటు చేసుకుంది. రైళ్లలో దోపిడీలకు పాల్పడుతున్న ముఠాను పట్టుకునే క్రమంలో జీఆర్పీ పోలీసులు జరిపిన కాల్పులు కలకలం రేపాయి. గుంటూరు, విజయవాడ డివిజన్ల పరిధిలో ఇటీవల సిగ్నల్ వ్యవస్థను టాంపరింగ్ చేసి, రైళ్లను ఆపి దోపిడీలకు పాల్పడుతున్న ఘటనలు పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో రైల్వే పోలీసులు నిఘా తీవ్రం చేశారు.దోపిడీ దొంగల ముఠా పై జీఆర్పీ పోలీసుల కాల్పులు జరిపిన ఘటన గుంటూరు జిల్లాలో జరిగింది. తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో పొన్నూరు మండలం నిడుబ్రోలు రైల్వే స్టేషన్ సమీపంలోని ఆలూరు గేట్ వద్ద నరసరావుపేట రైల్వే ఎస్సై, ఇద్దరు కానిస్టేబుళు గస్తీ నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు .ఆత్మరక్షణ కోసం కాల్పులు: నిందితుల వద్ద వైర్లు కత్తిరించే పరికరాలు ఉండటాన్ని గమనించిన పోలీసులు వారిని పట్టుకోవడానికి



ప్రయత్నించారు. అయితే ఆ దుండగులు లొంగిపోకుండా పోలీసులపైకి రాళ్లు రువ్వుతూ దాడికి తెగబడ్డారు. అప్రమత్తమైన పోలీసులు ఆత్మరక్షణ కోసం వారిపైకి కాల్పులు జరిపారు.దీంతో వారు అక్కడి నుంచి పారిపోయారు. మంగళవారం తెల్లవారుజామున దాదాపు 3 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. ఇటీవల గుంటూరు, విజయవాడ డివిజన్ల పరిధిలో సిగ్నల్ టాంపరింగ్ చేసి దోపిడీలకు పాల్పడుతున్న ఘటనలు జరుగుతున్నాయి. దీంతో జీఆర్పీ పోలీసులు రాత్రి పూట తనిఖీలు నిర్వహిస్తున్నా రు. నరసరావుపేట రైల్వే పోలీసు ఎస్సైతో పాటు ఇద్దరు కానిస్టేబుళ్లు తనిఖీ బృందంలో ఉన్నారు.సమీపంలోని పొలాల వైపు దుండగులు పరారు: ఘటనపై సమాచారం అందుకున్న పొన్నూరు పోలీసులు వెంటనే క్షేత్రస్థాయికి చేరుకుని విచారణ చేపట్టారు. మొత్తం 10 రౌండ్లు కాల్పులు జరిపినట్లు జీఆర్పీ డీఎస్పీ అక్కేశ్వరరావు తెలిపారు. పోలీసుల కాల్పులతో భయభ్రాంతలకు గురైన దుండగులు చీకట్లోకి సమీపంలోని పొలాల వైపు పరారైనట్టు చెప్పారు. దుండగులు వదిలివెళ్లిన వైర్ కట్టర్, టెస్టర్, ఒక జత గ్లౌజులు మొదలైన వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. రైలు ప్రయాణికుల భద్రత దృష్ట్యా రాత్రిపూట గస్తీని మరింత పెంచుతామని అధికారులు స్పష్టం చేశారు. "సిగ్నల్ టెంపరింగ్ చేస్తున్న వారిని దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు గత కొద్ది రోజులుగా గుంటూరు రైల్వే సబ్? డివిజన్ పరిధిలో పెట్రోలింగ్ చేస్తున్నాం. రైళ్లలో దోపిడీల నియంత్రణ కోసం గస్తీ నిర్వహిస్తుండగా తెల్లవారుజామున దాదాపు 3 గంటల సమయంలో ట్రాక్ వెంట కట్టర్లు పట్టుకుని ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. వారిని పట్టుకునే యత్నం చేశాం. దుండగులు పోలీసులపై రాళ్లు రువ్వారు. వారిపై మొత్తం 10 రౌండ్ల కాల్పులు జరిపాం. దుండగులు సమీపంలోని పొలాల వైపు పరారయ్యారు. రైల్వే ప్రయాణికులు, చుట్టూపక్కల గ్రామాల ప్రజలు మీకు ఎవరైనా అనుమానితులు కనిపించినట్లయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు." – అక్కేశ్వరరావు, జీఆర్పీ డీఎస్పీ

# కొత్త వాహనాల రిజిస్ట్రేషన్.. 24 గంటల్లోనే పూర్తి



**అమరావతి, మే 12:** ఏపీలో కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై 24 గంటల్లోనే కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ పూర్తి చేయనున్నట్లు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రకటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఈ కొత్త విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. వాహనదారులకు వేగవంతమైన సేవలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. డీలర్ టెంపరరీ రిజిస్ట్రే షన్ అనంతరం 24 గంటల్లోనే రిజిస్ట్రేషన్‌కు ఆమోదం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.ఫ్యాన్సీ నంబర్ వాహనాలకు మాత్రమే మిన హాయింపు ఉంటుందని మంత్రి తెలిపారు. గడువులోపు సంబంధిత అధికారులు స్పందించకపోతే ఆటోమేటిక్‌గా రిజిస్ట్రేషన్ ఆమోదం అయినట్లు పరిగణించనున్నట్లు తెలిపారు. సెలవు రోజుల్లో కూడా ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్‌ను ఆమోదిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తం గా ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్లకు చెక్ పెట్టనున్నట్లు తెలిపారు. ప్రజలకు పారదర్శకంగా, సులభంగా సేవలు అందించడం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ఈ కొత్త విధానం అమలు చేయనున్నట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రకటించారు.

## రైతులకు అన్యాయం జరిగితే సహించబోం



**అమరావతి, మే 12 :**
రొయ్యల ఫీడ్ ధరలను కొన్ని ఫీడ్ కంపెనీలు పెంచడంపై ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నా యుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులతో చర్చించకుండా ధరలు పెంచడం సరైంది కాదని అభిప్రాయపడ్డారు. వనామీ ఫీడ్‌పై రూ.8, టైగర్ ఫీడ్‌పై రూ.10లు కొన్ని ఫీడ్ కంపెనీలు పెంచాయని పేర్కొన్నారు. (మం గళవారం) అమరావతి వేదికగా మంత్రి అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడారు. చట్టాన్ని పాటించాలని ఫీడ్ కంపెనీలను మంత్రి హెచ్చరించారు. పెంచిన ధరల అమలు నిలిపివేయాలని నోటీసులు జారీ చేశారు. ఫీడ్ ధరల పెంపు విషయంపై ఆక్వా చట్టప్రకారం కమిటీలో నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రైతులకు అన్యాయం జరిగితే సహించబోమని మందలించారు. ఆక్వా రైతుల పక్షాన ప్రభుత్వం ఎల్లప్పుడూ నిలుస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు భరోసా కల్పించారు.

# రాజధాని అమరావతిలో కిమ్స్ - భూమిపూజ చేయనున్న సీఎం చంద్రబాబు


**అమరావతి:** రాజధానిలో మరో ప్రముఖ వైద్యసంస్థ అడుగు పెట్టనుంది. వైద్య రంగంలో అత్యాధునిక సేవల ందిస్తూ ఖ్యాతి గడించిన కిమ్స్ ఇప్పుడు అమరావతిలోనూ అడుగు పెడుతోంది. 25 ఎకరాల్లో రూపుదిద్దుకోబోతున్న కిమ్స్ ఆస్పత్రి, విశ్వవిద్యాలయానికి సీఎం చంద్రబాబు ఈ నెల 13వ తేదీన భూమిపూజ చేయనున్నారు. ఇప్పటికే బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి పనులు అమరావతిలో ప్రారంభం కాగా కిమ్స్ రాకతో వైద్యరంగం విస్తరణకు మరింత దోహదపడనుంది.నవ్యాంధ్ర రాజధాని నిర్మాణం శరవేగంగా సాగుతున్న వేళ ప్రముఖ సంస్థలు అమరావతికి క్యూ కడుతున్నాయి. ప్రభుత్వ పరిపాలనా భవనాల నిర్మాణంతో పాటే జాతీయ స్థాయిలో పేరొందిన ప్రైవేటు ఆస్పత్రులు, హోటళ్ల నిర్మాణాలు జరగడం రాజధాని కీర్తిని మంరింత పెంచుతోంది. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తూ వివిధ



ప్రాంతాల్లో ఆసుపత్రులు నిర్వహిస్తున్న కిమ్స్ గ్రూప్ అమరావతిలో వైద్య విశ్వవిద్యాలయంతో పాటు ఆసుపత్రి నిర్మించనుంది.మూడేళ్లలో పూర్తి చేసేలా ప్రణాళికలు: కిమ్స్ గ్రూప్‌నకు గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నిడమర్రు సమీపంలో సీఆర్డీఏ 25 ఎకరాలు కేటాయించింది. 23 ఎకరాల్లో కిమ్స్ బైసర్ స్కిల్ వర్సిటీ, 2 ఎకరాల్లో ఆసుపత్రి నిర్మిస్తారు. ముందుగా 500 పడకలతో హాస్పిటల్ కట్టనున్నారు. స్కిల్ యూనివర్శిటీలో భాగంగా వైద్య కళాశాల ఏర్పాటు చేస్తారు. ఎంబీబీఎస్, నర్సింగ్‌తో పాటు అనుబంధ కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. నిర్మాణాల కోసం ఎకరాకు రూ.50 లక్షల చొప్పున చెల్లించిన కిమ్స్ సంస్థ ఈ మేరకు సీఆర్డీఏతో ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో నిర్మాణ పనులకు ముహుర్తం ఖరారు చేశారు. బుధవారం ఉదయం 10 గంటలకు సీఎం చంద్రబాబు కిమ్స్ భవనాల నిర్మాణానికి భూమిపూజ చేయనున్నారు. 2, 3 ఏళ్లలో నిర్మాణాలు పూర్తి చేసేలా ప్రణాళికలు చేశారు.రాజధాని అభివృద్ధిలో వైద్య సంస్థలు కీలకం కానున్నాయి. అమరావతిలో ఇప్పటికే బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రికి భూమిపూజ చేసి పనులు కూడా మొదలుపెట్టారు. ఇప్పుడు విజయవాడ బైపాస్‌కు, జాతీయ రహదారికి సమీపంలోనే ప్రతిష్టాత్మక కిమ్స్ రావడం వైద్య రంగ విస్తరణకు దోహదం కానుంది. తద్వారా రాజధాని ప్రాంతవాసులు, చుట్టుపక్కల ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి."మాకు అమరావతిలో ప్రభుత్వం, సీఆర్డీఏ తరపు నుంచి 25 ఎకరాలు భూమి కేటాయించబడింది. అందులో 23 ఎకరాలు బైసర్ స్కిల్ యూనివర్సిటీకి, 2 ఎకరాలు హాస్పిటల్?కి కేటాయించారు. బైసర్ కాలేజీలో 1000 పడకల హాస్పిటల్ ఇంక పలు రకాల కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. దీని ద్వారా అమరావతి ప్రజలు ఎక్కడికి వెళ్లకుండా మంచి సౌకర్యం కలిగింది." – సురేశ్, కిమ్స్ ఆస్పత్రి ప్రాజెక్ట్స్ డైరెక్టర్

# అనాథ శరణాలయమే ప్రతిభాపాటవానికి వేదిక

**పల్నాడు జిల్లా :** ఆలనా పాలనా చూడటానికి అమ్మలేదు! ఆటపాటలు నేర్పించటానికి నాన్న అందుబాటులో లేడు. ఆశ్రయం కల్పించిన అనాథ శరణాలయమే ఆ బాలిక ప్రతిభాపాటవానికి వేదికైంది. ఆన్‌లైన్‌లో కీబోర్డు సాధన చేసి, గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించింది. క్రీడల్లోనూ రాణిస్తోంది జ్యోతి సహారిక.ప్రతిభకు పేదరికం అడ్డుకాదనేందుకు నిదర్శనమే కీ బోర్డు మీద చక్కగా సరిగమలు పలికిస్తున్న జ్యోతి సహారిక. పల్నాడు జిల్లా ధరణికోటకు చెందిన జ్యోతి చిన్నతనంలోనే తల్లిని కోల్పోయింది. తండ్రి అనారోగ్య సమస్యలతో ఇబ్బందిపడుతున్నారు. అందరూ ఉన్న అనాథలలా మిగిలారు జ్యోతి, ఆమె చెల్లి. ఇక




బంధువులే ఇద్దరినీ బ్రాహ్మణకోడూరులోని చైల్డ్ అనాథ శరణాలయంలో చేర్పించారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న జ్యోతి చదువుతోపాటు సంగీతంపై ఆసక్తి చూపేది.సంగీత బృంద ప్రదర్శనలో సత్తా : అనాథ శరణాలయం నిర్వాహకులు జ్యోతి ఉత్సాహాన్ని గుర్తించి ప్రోత్సహించారు. ఆన్‌లై న్‌లో శిక్షణ ఇప్పించారు. అలా నిరంతర సాధన చేసిన జ్యోతి, ఈ ఏడాది ఫిబ్రవరి 2న హైదరా బాద్‌లో నిర్వహించిన సంగీత బృంద ప్రదర్శనలో సత్తాచాటింది. గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించిన టీంలో నిలిచింది. ఇటీవల విజయవాడ హలోల్ సంగీత పాఠశా లలో నిర్వహించిన అచీవర్స్ మీట్‌లో జ్యోతికి గిన్నిస్ రికార్డు సర్టిఫికెట్ అందజేశారు." సాయంత్రం పాఠశాల నుంచి వచ్చాక కీబోర్డు సంగీతం గురించి ఆన్‌లైన్‌లో క్లాసులు వింటాను. అలాగే ప్రతిరోజు గంటసేపు ప్రాక్టీస్ చేస్తాను. చదువుపై కూడా ఎక్కువగా శ్రద్ధ చూపుతున్నాను. కీ బోర్డుతో పాటు, క్రీడల్లోనూ రాణిస్తున్నాను. బేస్ బాల్ పోటీల్లో జిల్లా, రాష్ట్ర స్థాయి పతకాలు సాధించి, జాతీయ స్థాయికి ఎంపిక అయ్యాను.సంగీతంలోనే కాదు క్రీడల్లోనూ జ్యోతి సత్తా చాటుతోంది. ఇప్పటికే పలు జిల్లా, రాష్ట్ర స్థాయి బేస్ బాల్ పోటీల్లో పతకాలు సాధించింది. ఈ నెల 5 నుంచి 7వరకూ కర్నూలు కేంద్రంగా జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి జూనియర్ బేస్ బాల్ టోర్నీలో ఉత్తమ ప్రతిభ చూపింది.

# టెన్త్‌లో ఉత్తమ మార్కులు.. గురుకుల విద్యార్థులకు మంత్రి సవిత సత్కారం



**విజయవాడ, మే 12:** టెన్త్ క్లాస్‌లో మంచి మార్కులు సాధించిన గురుకుల విద్యార్థులను మంత్రి సవిత సత్కరించారు. దాదాపు 400 మంది విద్యార్థులకు పురస్కారాలు, మెమోంటోలను అందజేశారు. టెన్త్ క్లాస్‌లో ఎంజేపీ గురుకుల పాఠశాల విద్యార్థిని, నంద్యాలకు చెందిన సాయి శ్రీ 596 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రం అంతా బీసీ సంక్షేమ స్కూల్స్‌వైపే చూడ్డానికి కారణం ప్రిన్సిపాల్స్, సెక్రటరీస్, డైరెక్టర్లు అని అన్నారు. బీసీ సంక్షేమ స్కూళ్లలో చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని విద్యార్థులు నిరూపించారన్నారు. వేదిక మీద చాలామంది గవర్నమెంట్ స్కూళ్లలో చదువుకున్నవారే ఉన్నారన్నారు. 'తల్లిదండ్రులు మమ్మల్ని నమ్మి.. మీ బిడ్డలను బీసీ సంక్షేమ స్కూల్స్‌కు పంపించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు' అని మంత్రి అన్నారు. తల్లిదండ్రులు కోరుకున్న విధంగానే విద్యార్థులకు మంచి మార్కులు వచ్చాయని తెలిపారు

## తొలి వ్యక్తిగా 'మామ' రికార్డు- అసోం సీఎం కుర్చీ మళ్లీ హిమంతకే ఎందుకు దక్కింది బీజేపీ ప్లాన్ ఏంటి




**అసోం :** హిమంత బిశ్వ శర్మ రెండోసారి అసోం ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యమంత్రితో కలిపి కేవలం నలుగురు మంత్రులే ప్రమాణ స్వీకారం చేశారు. ఈ చిన్న క్యాబినెట్‌లో బీజేపీతో పాటు దాని మిత్రపక్షాలైన అసోం గణ పరిషత్ (ఏజీపీ), బోడోలాండ్ పీపుల్స్ ఫ్రంట్ (బీపీఎఫ్)లకు సమాన ప్రాతినిధ్యాన్ని కల్పించారు. మిగిలిన మంత్రి పదవులను రాబోయే రోజుల్లో దశలవారీగా భర్తీ చేయనున్నారు. గువాహటిలో జరిగిన ఈ వేడుకలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఇతర కీలక నాయకులు పాల్గొన్నారు. హిమంత బిశ్వ శర్మ మళ్లీ సీఎంగా నియమితులు కావడానికి దోహదపడిన కీలక అంశాలేమిటి తొలి ఐదేళ్ల పాలనలో అసోం రూపురేఖలను మార్చేలా ఆయన ఏమేం చేశారు మహిళలు, స్థానిక మూలవాసులలో హిమంతకు ఇంతటి ప్రజాదరణ ఎలా వచ్చింది రాష్ట్రంలోనే తొలిసారిగా బీజేపీ సొంత మెజారిటీతో ప్రభుత్వాన్ని ఎలా ఏర్పాటు చేయగలిగింది ఈ కథనంలో తెలుసుకుందాం.బీజేపీ హ్యాట్రిక్ – 82 సీట్లతో ధమాకా2026 అసోం అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమి చారిత్రక విజయాన్ని సాధించింది. మొత్తం 126 స్థానాలకుగానూ ఈ కూటమి 102 స్థానాలను కైవసం చేసుకుంది. వీటిలో 82 సీట్లను ఒక్క బీజేపీయే గెల్చుకుంది. రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన మ్యాజిక్ ఫిగర్ 64. దీన్ని కమలదళం ఒంటరిగానే సాధించడం విశేషం. దీంతో రాబోయే ఐదేళ్లు ప్రాంతీయ పార్టీలపై ఆధార పడాల్సిన అవసరం లేకుండా బీజేపీ పూర్తి ఆధిపత్యాన్ని సాధించింది. బీజేపీ మిత్రపక్షాలైన అసోం గణ పరిషత్ (ఏజీపీ), బోడోలాండ్ పీపుల్స్ ఫ్రంట్ (బీపీఎఫ్)లకు చెరో 10 సీట్లు వచ్చాయి. ఇక ప్రతిపక్షంలోని కాంగ్రెస్ 19 సీట్లు, ఆల్ ఇండియా యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ 2 సీట్లు, రైజోర్ దళ్ 2 సీట్లు, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) 1 సీటును గెల్చుకున్నాయి. ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తన సొంత నియోజకవర్గమైన జలుక్‌బరీ నుంచి రికార్డు స్థాయిలో ఆరోసారి విజయం సాధించారు. ఈ విజయంతో అసోంలో బీజేపీ వరుసగా మూడోసారి (హ్యాట్రిక్) ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తోంది. 2016, 2021 ఎన్నికల తర్వాత ఇప్పుడు 2026లోనూ విజయం సాధించి, బీజేపీ రాష్ట్రంలో వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చింది. కాగా, ప్రతిపక్ష నాయకుడు గౌరవ్ గొగోయ్ (కాంగ్రెస్) జోర్హాట్ నియోజకవర్గంలో ఓటమి పాలయ్యారు.ఎన్‌డీఏ కూటమి లీడర్‌గా ఏకగ్రీవ ఎన్నికమే 10న గువాహటిలో కొత్తగా ఎన్నికైన బీజేపీ ఎమ్మెల్యేలందరూ (82 మంది) సమావేశమై హిమంత బిశ్వ శర్మను తమ శాసనసభా పక్ష నాయకుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కూటమి భాగస్వామ్య పక్షాలైన ఏజీపీ, బీపీఎఫ్ ఎమ్మెల్యేలు కూడా ఆయనకే జై కొట్టారు. దీనితో ఆయన పూర్తి ఎన్‌డీఏ కూటమి లీడర్‌గా మారారు.పార్టీలో కానీ, కూటమిలో కానీ ఆయన నాయకత్వంపై ఎలాంటి వ్యతిరేకత రాలేదు. ఈ అధికారిక ఎన్నిక ముగిసిన వెంటనే, ఆయన గవర్నర్‌ను కలిసి ఎమ్మెల్యేల మద్దతు పత్రాన్ని సమర్పించి ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతి పొందారు. కాంగ్రెసేతర పార్టీ లేదా కూటమి తరఫున వరుసగా రెండోసారి సీఎం పీఠాన్ని అధిరోహించిన తొలి నేతగా హిమంత రికార్డును సాధించారు.

## తమిళనాడు అసెంబ్లీ స్పీకర్‌గా టీవీకే ఎమ్మెల్యే ప్రభాకర్ ఏకగ్రీవం



**చెన్నై:** తమిళనాడు అసెంబ్లీ స్పీకర్‌గా టీవీకే ఎమ్మెల్యే జేసీడీ ప్రభాకర్ మంగళవారంనాడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీవీకేకు చెందిన మరో ఎమ్మెల్యే రవిశంకర్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నికయ్యారు. స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక కోసం ఈ సమావేశం ఏర్పాటు చేసినట్టు ప్రోటెం స్పీకర్ ఎంవీ కరప్పయ్య తెలిపారు.తొలుత ప్రభాకర్ నామినేషన్‌ను ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ ప్రతిపాదించారు. ఒకే నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీవంగా స్పీకర్ ఎన్నిక జరిగింది. అనంతరం ప్రోటెం స్పీకర్‌గా తన పాత్ర ముగిసినట్టు కరుప్పయ్య ప్రకటించారు. ఆ వెంటనే సభాసాంప్రదాయం ప్రకారం స్పీకర్ ప్రభాకర్‌ను ఆయన చైర్ వరకూ సభానేత కేఏ సెంగోట్టియన్, ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ తోడ్కొని వెళ్లారు. ఆయనకు అభినందనలు తెలిపారు.స్పీకర్‌గా ప్రభాకర్ బాధ్యతలు చేపట్టిన వెంటనే డిప్యూటీ స్పీకర్ ఎన్నికను చేపట్టారు. డిప్యూటీ స్పీకర్ పదవికి తురైయూర్ టీవీకే ఎమ్మెల్యే ఎం.రవిశంకర్ ఒక్కరే నామినేషన్ వేశారని, దీంతో ఆయన ఎన్నిక ప్రభాకర్ ప్రకటించారు. రవిశంకర్ నామినేషన్‌ను సెంగోట్టియన్ ప్రతిపాదించారు.

## గెస్ పేపర్‌ను రాజస్థాన్‌కు పంపిన కేరళ ఎంబీబీఎస్ విద్యార్థి



**జైపూర్:** నీట్ యూజీ 2026 పరీక్షను రద్దు చేసిన విషయం తెలిసిందే. అయితే ఆ పరీక్షకు సంబంధించిన 100 ప్రశ్నలు ముందుగానే రిలీజ్ కావడం వల్ల ఆ పరీక్షను రద్దు చేస్తున్నట్లు ఇవాళ ఎన్‌టీఏ ప్రకటించింది. అయితే రాజస్థాన్‌లోని స్పెషల్ ఆపరేషన్ గ్రూపు పోలీసులు ఈ కేసులో కూపీ లాగారు. మే 3వ తేదీ పరీక్ష జరగడానికి ముందు కేరళలోని ఎంబీబీఎస్ విద్యార్థి ఒకరు గెస్ పేపర్‌ను రాజస్థాన్‌కు పంపినట్లు తేల్చారు. అయితే ఆ టెస్ట్ మెటీరియల్ లేదా గెస్ పేపర్‌లో ఉన్న ప్రశ్నలే నీట్ పరీక్షలో వచ్చినట్లు అనుమానిస్తున్నారు. రాజస్థాన్ ఎస్‌ఓజీ డీజీపీ ఆనంద్ కుమార్ శ్రీవాత్సవ దీని గురించి వివరణ ఇచ్చారు. గెస్ పేపర్ కేరళ నుంచి వచ్చినట్లు తేలిందన్నారు. కేరళలో మెడిసిన చదువుతున్న ఓ విద్యార్థి ఆ మెటీరియల్‌ను పంపినట్లు ప్రాథమికంగా నిర్ధారించామన్నారు. ఇప్పటి వరకు ఈ కేసులో ఎఫ్ఐఆర్ నమోదు కాలేదన్నారు. ప్రాథమిక సమాచారాన్ని సేకరిస్తున్నామన్నారు. అయితే మెడికల్ విద్యార్థికి గెస్ పేపర్ ఎలా వచ్చిందన్న కోణంలో కూడా విచారణ చేపడుతున్నామన్నారు.గెస్ పేపర్‌ను రిలీజ్ చేసిన విద్యార్థి వివరాలను పోలీసులు వెల్లడించలేదు. కానీ అతను రాజస్థాన్ రాష్ట్ర నివాసితుడు అని తెలిసింది. అయితే తాత్కాలికంగా డబ్బులు సంపాదించేందుకు ఆ గెస్ పేపర్‌ను తయారు చేశాడా లేదా అన్న కోణంలో విచారిస్తున్నారు. గెస్ పేపర్‌ను తయారు చేసి చీటింగ్ చేశారా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఏడీజీపీ విశాల్ భన్సల్ తెలిపారు. మే 3వ తేదీ పరీక్ష కన్నా ముందు సుమారు 400 ప్రశ్నలు సర్క్యూలేట్ అయ్యాయి. ఇక బయోలజీ, కెమిస్ట్రీ సబ్జెక్టుకు చెందిన ప్రశ్నలు దాదాపు ఒకేలా ఉన్నాయని పోలీసులు చెబుతున్నారు. దీన్ని క్రిమినల్ కోణంలో విచారిస్తున్న నేపథ్యంలో ఇంకా కేసును రిజిస్టర్ చేయలేదని భన్సల్ వెల్లడించారు. రాజస్థాన్‌లోని సికర్‌లో ఉన్న ఓ కోచింగ్ సెంటర్‌కు కేరళ నుంచి మెటీరియల్ పంపినట్లు విచారణలో తేలిందన్నారు. ఇక అక్కడ నుంచి వాట్సాప్ ద్వారా ఆ ప్రశ్నలు వైరల్ అయ్యాయన్నారు.

## ముళ్లకంచెకు భయపడేది లేదు'- సరిహద్దుల్లో బంగాల్ బాబ్డ్‌వైర్‌పై స్పందించిన బంగ్లా

**న్యూఢిల్లీ, మే 13:** భారత్- బంగ్లాదేశ్ సరిహద్దుల్లో కంచె నిర్మాణం కోసం బీఎస్ఎఫ్‌కు భూమిని కేటాయిస్తూ నూత నంగా ఏర్పాటైన బంగాల్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిపై బంగ్లాదేశ్ స్పందించింది. ముళ్లకంచెకు బంగ్లాదేశ్ భయపడదని ఆ దేశ విదేశాంగ వ్యవహారాల సలహాదారు హుమ యున్ కబీర్ తెలిపారు. సరిహద్దు భద్రత విషయంలో భారత్ మరింత మానవీయ దృక్ప థంతో వ్యవహరించాలని సూచించారు. ఢాకా లో మీడియాతో మాట్లాడుతూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు.బంగాల్ ప్రజలు, ప్రభుత్వం ముళ్ల కంచెకు భయపడదని హుమాయున్ కబీర్ తెలిపారు. దేశ ప్రయోజనాల పరిరక్షణ కోసం అవసరమైనప్పుడు భారత్‌తో చర్చలు జరుపుతామని తెలిపారు. తాము మాట్లాడాల్సిన అవసరం ఉన్న చోట తప్పకుండా మాట్లాడతామని అన్నారు. కొత్త బంగాల్ ప్రభుత్వ ఎన్నికల ప్రచార వ్యాఖ్యలు నిజంగా అమల్లోకి వస్తాయా లేదా అనేది గమనిస్తామని చెప్పారు. భారత్ అంతర్గత రాజకీయాల్లో జోక్యం చేసుకోవాలనుకోవడం లేదని తెలిపారు. తమ సంబంధాలు ప్రధానంగా కేంద్ర ప్రభుత్వంతోనే ఉంటాయని పేర్కొన్నారు. భారత్- బంగ్లాదేశ్ మధ్య ప్రజల మధ్య సంబంధాలు మరింత బలపడాలంటే సరిహద్దు భద్రత విషయంలో



భారత్ మానవీయ దృక్పథాన్ని అవలంబించాలని కబీర్ సూచించారు. ఇప్పటికే కొన్ని సవాళ్లు ఉన్నప్పటికీ, రెండు దేశాల నాయకత్వం ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరచడంపై కట్టుబడి ఉందని ఆయన తెలిపారు.సరిహద్దు భద్రతపై అధికారి కఠిన వైఖరిబంగాల్?లో ఎన్?డీఏ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సీఎం సువేంద్ అధికారి నేతృత్వంలో సోమవారం తొలి క్యాబినేట్ సమావేశం జరిగింది. ఆ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు కంచె నిర్మాణానికి అవసరమైన భూములన్నింటినీ బీఎస్?ఎఫ్?కు అప్పగిస్తామ ని పేర్కొంది. మరో 45రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుందని తెలిపింది. సరిహద్దు కంచె నిర్మాణానికి అవసరమైన భూముల బదిలీని గత ప్రభుత్వం తృణమూల్ కాంగ్రెస్ ఉద్దేశపూర్వ కంగా ఆలస్యం చేసిందని బీజేపీ చాలా కాలంగా ఆరోపిస్తోంది. అయితే స్థానిక ప్రజల జీవనోపాధి, భూసంబంధిత సమస్యలను దృష్టిలో పెట్టుకోవాల్సిన అవసరం ఉందని టీఎంసీ వాదిస్తూ వచ్చింది. అయితే బంగాల్ ఎన్నికల ప్రచార సమయంలో కేంద్ర హోంమంత్రి అమిత్? షా, బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పెండింగ్‌లో ఉన్న భూములన్నింటినీ 45 రోజుల్లో బీఎస్?ఎఫ్?కు బదిలీ చేస్తామని హామీ ఇచ్చారు. 850 మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం, బంగాల్?కు బంగ్లాదేశ్?తో మొత్తం మొత్తం 4,097 కిలోమీటర్ల సరిహద్దు ఉంది. అందులో ఇప్పటికే సుమారు 3,240 కిలోమీటర్ల మేర కంచె నిర్మాణం పూర్తయ్యింది. ఇంకా దాదాపు 850 కిలోమీటర్ల ప్రాంతంలో కంచె నిర్మాణం మిగిలి ఉండగా, అందులో 175 కిలోమీటర్లు క్లిష్ట భూభాగంగా గుర్తించారు. తొలి క్యాబినేట్ సమావేశంలో కంచె నిర్మాణం గురించే కాకుండా పలు కీలక నిర్ణయాలు కూడా తీసుకుంది సువేందు సర్కార్. కేంద్రం తీసుకొచ్చిన ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకంలో తమ రాష్ట్రాన్ని చేరుస్తున్నట్లు ప్రకటించింది. జూన్ 1నుంచి ఈ పథకాన్ని అలాగే రాష్ట్రంలో మహిళలకు జూన్ 1 నుంచి ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించాలని నిర్ణయించింది. క్రిమినల్ చట్టాలైన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్)లను తమ రాష్ట్రంలో కూడా అమల్లోకి తీసుకొస్తామని వెల్లడించింది. కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ జారీ చేసిన జూన్ 2025 జనగణన సర్క్యులర్‌ను తక్షణమే అమలు చేసేలా మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఇక బంగాల్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)గా మనోజ్ అగర్వాల్ నియమితులయ్యారు.


## సోనియాతో భేటీ కానున్న కేరళ నేతలు.. ముఖ్యమంత్రి అభ్యర్థి ఎంపికపై చర్చ

**న్యూఢిల్లీ, మే 13:** కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని యూనైటెడ్ డెమోక్రటిక్ ఫ్రెంట్ (యూడీఎఫ్)కు ఆ రాష్ట్ర ఓటరు పట్టం కట్టారు. ఈ ఎన్నికల్లో యూడీఎఫ్‌కు ఓటరు స్పష్టమైన మేజార్టీ కట్టబెట్టాడు. ఈ ఎన్నికల ఫలితాలు వెలువడి వారం రోజులు దాటినా.. ముఖ్యమంత్రి ఎంపికపై ఆ పార్టీ అధిష్ఠానం ఒక నిర్ణయానికి రాలేదు. సీఎం అభ్యర్థి ఎంపిక కోసం తీవ్ర కసరత్తు జరుగుతుంది. సీఎంని ఎంపిక చేయడం కోసం మంగళవారం న్యూఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియాగాంధీతో కేరళ మాజీ పీసీసీ నేతలు.. కె. సుధాకరన్, కె. మురళీధరన్, వి.ఎం. సుధీరన్, ముల్లపల్లి రామచంద్రన్ సమావేశం కానున్నారు.సీఎం రేసులో ఆ ముగ్గురు..కేరళ ముఖ్యమంత్రి పదవి రేసులో





కేసీ వేణుగోపాల్, వీడీ సతీశన్, రమేశ్ చెన్నితాల ఉన్నారు. ఈ రేసులో పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పేరు ముందు వరుసలో ఉంది. రాహుల్ గాంధీని ఆయన అత్యంత సన్నిహితుడిగా ఉండడమే కాకుండా.. ఈ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కీలక పాత్ర పోషించారు.వీడీ సతీశన్ సైతం ప్రతిపక్ష నేతగా ఉండి.. పార్టీ బలోపేతం కోసం తీవ్రంగా శ్రమించారు. కాంగ్రెస్ పార్టీని ప్రతిపక్షం నుంచి అధికార పక్షంలోకి తీసుకు రావడంలో ఆయన ముఖ్య భూమిక పోషించారు.రమేశ్ చెన్నితాల పార్టీలో సీనియర్ నేత. క్లిష్ట సమయంలో పార్టీని బలోపేతం చేయడంలో ఆయన అన్ని తానై వ్యవహరించారు.తాజా అసెంబ్లీ ఎన్నికల్లో..ఈ ఎన్నికల్లో కేరళను పదేళ్ల పాలించిన ఎల్డీఎఫ్‌కు కేవలం 35 సీట్లకే పరిమితమైంది. బీజేపీ కేవలం మూడు స్థానాల్లో మాత్రమే విజయం సాధించింది. యూడీఎఫ్ 102 స్థానాల్లో విజయ కేతనం ఎగరవేసింది.ఈ ఏడాది ఏప్రిల్‌లో..ఈ ఏడాది ఏప్రిల్‌లో దేశంలోని నాలుగు రాష్ట్రాలు కేరళ, తమిళనాడు, అస్సాం, పశ్చిమ బెంగాల్‌తోపాటు ఒక కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి అసెంబ్లీకి ఎన్నికల జరిగాయి. మే 4వ తేదీన ఆయా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. దాంతో తమిళనాడు, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఇప్పటికే జరిగిపోయింది.అస్సాం ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమం మంగళవారం జరిగింది. పుదుచ్చేరి సీఎంగా ఎన్. రంగస్వామి బుధవారం ప్రమాణ స్వీకారం చేసేందుకు ముహూర్తం కూడా ఖరారైంది. కానీ కేరళలో మాత్రం ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరనే దానిపై సస్పెన్స్ కొనసాగుతోంది. సోనియాగాంధీతో ఈ రోజు జరుగనున్న ఈ భేటీతో సీఎం ఎవరనే దానిపై స్పష్టత వస్తుందని కేరళలోని కాంగ్రెస్ పార్టీ నేతలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

## మద్యం దుకాణాలకు చెక్ పెట్టిన సీఎం విజయ్



**చెన్నై::** తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే నటుడు, రాజకీయ నాయకుడు విజయ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థలు, దేవాలయాలు, బస్టాండ్‌లకు సమీపంలో ఉన్న 717 మద్యం దుకాణాలను తక్షణమే మూసివేయాలని ఆదేశించారు. ప్రజల చిరకాల వాంఛ అయిన ఈ నిర్ణయంపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్య ంగా, ప్రముఖ నటుడు, రాజ్యసభ సభ్యుడు కమల్ హాసన్ కూడా ఎక్స్ వేదికగా ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ సీఎం విజయ్‌ను అభినందించారు.ఆకాంక్షలను గౌరవిస్తూ, పదవీ బాధ్యతలు చేపట్టిన వెంటనే సీఎం విజయ్ తీసుకున్న ఈ చర్య అభినందనీయమని కమల్ హాసన్ పేర్కొన్నారు. మద్యం విక్రయాలు ప్రభుత్వ ప్రధాన విధి కాకూడదని, మద్యం ప్రవాహాన్ని నియంత్రించే బాధ్యతను మాత్రం ప్రభుత్వం తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రస్తుతానికి 717 దుకాణాలను మూసివేయడం ద్వారా శుభారంభం జరిగిందని, భవిష్యత్తులో ఈ సంఖ్యను మరింత పెంచుతూ సంపూర్ణ నియంత్రణ దిశగా అడుగులు వేయాలని కోరారు.


## మూడు రోజులు చైనాలో డొనాల్డ్ ట్రంప్ పర్యటన



**అమెరికా:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ () బుధవారం నుంచి శుక్రవారం వరకు మూడు రోజులు చైనా లో పర్యటించనున్నారు. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ఆహ్వానం మేరకు ట్రంప్ ఆ దేశ పర్యటనకు వెళ్తున్నారు. ట్రంప్ తమ దేశ పర్యటనకు వస్తున్నారని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి మీడియాకు వెల్లడించారు. దాదాపు తొమ్మిదేళ్ల అనంతరం ట్రంప్ అమెరికా అధ్యక్షుని హోదాలో చైనాకు వస్తున్నారని ఆయన పేర్కొన్నారు.ట్రంప్ చివరిసారిగా తన తొలి టర్మ్‌లో 2017లో అధ్యక్ష హోదాలో చైనాను సందర్శించారు. ఇరాన్‌తో యుద్ధం, హర్మూజ్ జలసంధి దిగ్బంధనం, ప్రపంచ ఆర్థిక సంక్షోభానికి దారితీసిన పరిస్థితుల్లో ట్రంప్ చైనా పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. బుధవారం సాయంత్రానికల్లా ట్రంప్ బీజింగ్ చేరుకుంటారు.

## సనాతన ధర్మం ప్రజలను విభజిస్తుంది- దాన్ని నిర్మూలించాలి

**చెన్నై:** సనాతన ధర్మం ప్రజలను విభజిస్తోందని, దానిని కచ్చితంగా నిర్మూలించాలని డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ మంగళవారం పేర్కొన్నారు. 2023 సెప్టెంబర్‌లో తాను చేసిన ఈ వివాదాస్పద వ్యాఖ్యలను మళ్లీ పునరుద్ఘాటించారు. తమిళనాడు అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా చేసిన తొలి ప్రసంగంలో ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. తమిళ ప్రార్థనా గీతం 'తమిళ్ తాయ్? వాల్తు' ను పక్కన పెట్టే ఏ ప్రయత్నాన్ని ప్రతిపక్షం అనుమతించదు అని స్పష్టం చేశారు. గతంలో ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మాన్ని కచ్చితంగా నిర్మూలించాలని చేసిన వ్యాఖ్యలు పెను దుమారాన్ని రేపాయి. ఆ సమయంలో హిందూ అనుకూల సంస్థల నుంచి ఆయన



తీవ్ర విమర్శలను, కోర్టు కేసులను ఎదుర్కొన్నారు.ముందు రాష్ట్ర గీతం పాడాల్సిందే!ఇటీవల జరిగిన నూతన ప్రభుత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో తమిళ రాష్ట్ర గీతాన్ని మొదటగా పాడలేదు. వరుసగా వందేమాతరం, జనగణమన, తమిళ్ తాయ్ వాల్తు పాడారు. దీనిపై ఉదయనిధి అభ్యంతరం వ్యక్తం చేశారు. 'మీ ప్రభుత్వ ప్రమాణ స్వీకారోత్సవంలో జరిగిన ఇలాంటి పొరపాటు మళ్లీ జరగడానికి మీరు (విజయ్) అనుమతించకూడదు. మేము అయితే అస్సలు అనుమతించేది లేదు. అసెంబ్లీలోనే కాదు, తమిళనాడులో జరిగే ఏ ప్రభుత్వ కార్యక్రమంలో నైనా తమిళ్ తాయ్ వాల్తుకే ఎప్పుడూ ప్రథమ స్థానం ఇవ్వాలి. ఈ విషయంలో ఎప్పుడూ రాజీ పడకుండా చూడాలని నేను ఈ ప్రభుత్వాన్ని కోరుతున్నాను. మన హక్కులను, సంప్రదాయాలను కాపాడుకోవడంలో మనం అప్రమత్తంగా ఉండాలి. రాష్ట్ర గీతాన్ని కాదని, ముందుగా జాతీయ గేయం, గీతం పాడడం వల్ల ప్రజల్లో తీవ్ర దిగ్భ్రాంతి, ఆగ్రహం వ్యక్తమయ్యాయి' అని ఉదయనిధి అన్నారు. 2023లో ఆనాటి తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి జాతీయ, రాష్ట్ర గీతాల ఆలాపన విషయంలో ప్రోటోకాల్ మార్చడానికి ప్రయత్నించారు. దానిని ఆనాటి డీఎంకే సర్కార్ ఏ విధంగా అడ్డుకుందో ఉదయనిధి స్టాలిన్ సభకు గుర్తు చేశారు. అలాగే ప్రస్తుత అసెంబ్లీలో ప్రతిపక్షాల పాత్రను వివరిస్తూ, ద్రవిడ దిగ్గజం, డీఎంకే వ్యవస్థాపకుడు సీఎన్ అన్నాదురై చెప్పిన మాటలను ఉదయనిధి ఉటంకించారు. నడిపించేందుకు, ప్రతిపక్షం అనేది ఒక వాహనానికి ఉన్న బ్రేకులు లేదా ఎద్దుకు కళ్లెం లాంటిది' అని అభివర్ణించారు.

# అది ఓటమి కాదు... ఓ ప్రమాదానికి సంకేతం

కేరళం అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం దేశవ్యాప్తంగా ఎన్నో విశ్లేషణలు వినిపిస్తున్నాయి. కానీ వాటన్నింటి వెనుక చివరికి మిగిలే ప్రశ్న ఒక్కటే. అక్కడ ఓడింది కేవలం ఎల్‌డీఎఫ్ ప్రభుత్వమేనా? లేక ప్రజా రాజకీయాలా? ఈ ప్రశ్నను తేలిగ్గా తీసుకోలేం. ఎందుకంటే ఈ ఎన్నికలను కేవలం ఒక సాధారణ అధికార వ్యతిరేక తీర్పుగా మాత్రమే చూడటం అంటే అది భారత రాజకీయాల్లో జరుగుతున్న లోతైన మార్పులను విస్మరించడమే అవుతుంది. ఈ ఫలితాలు మారుతున్న భారత రాజకీయాల స్వభావాన్ని బ పెడుతున్నాయి. కొన్ని ఫలితాలు కేవలం ప్రభుత్వాలను మాత్రమే మార్చవు, సమాజం ఏ దిశగా ప్రయాణిస్తోందో తెలిపే చారిత్రక మలుపులుగా నిలుస్తాయి. కేరళం ఫలితాలు సరిగ్గా అలాంటివే. ప్రచారం పాలనను మించిపోయిన కాలానికి ఈ తీర్పు నిదర్శనం. డబ్బు, మీడియా, మత ధ్రువీకరణలు కలిసి ప్రజా రాజకీయాలను ఎలా వెనక్కి నెడుతున్నాయో చూపిస్తున్న సమకాలీన వాస్తవం. ఒకప్పుడు ఎన్నికలు ప్రధానంగా ప్రజల జీవన సమస్యల చుట్టూ తిరిగేవి. భూమి, ఉపాధి, విద్య, ఆరోగ్యం, కార్మిక హక్కులు, ధరల పెరుగుదల.. ఇవే రాజకీయ చర్చలకు కేంద్రంగా ఉండేవి. ఇప్పుడు దఅశ్యం పూర్తిగా మారి పోయింది. ఎన్నికలు క్రమంగా ప్రజల జీవితాల నుంచి దూరమై, భావోద్వేగాల నిర్వహణగా మారుతున్నాయి. ఇప్పుడు ఓటర్లను ప్రభావితం చేసేది కేవలం పాలన కాదు, ప్రచారం. నిజాలు కాదు, నిర్మించబడిన కథనాలు. ప్రజల అనుభవాలు కాదు, వారి భయాలు, ఆవేశాలు, మానసిక ఉద్రిక్తతలు. ప్రజల జీవన సమస్యలు ఎన్నికల వేదికలపై అక్కడక్కడ వినిపించినా, అవి నిర్ణయాత్మక రాజకీయ చర్చలుగా నిలబడే పరిస్థితి క్రమంగా బలహీనపడుతోంది. ఈ పరిస్థితుల్లో ప్రజా సంక్షేమం, లౌకికత, సామాజిక న్యాయం వంటి అంశాలను కేంద్రంగా పెట్టుకుని రాజకీయాలు చేసే వామపక్ష శక్తులు తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కోవడం సహజమే. అందుకే కేరళం ఎన్నికల ఫలితాలను కేవలం ఎల్‌డిఎఫ్ ప్రభుత్వ ఓటమిగా మాత్రమే చూడటం సరిపోదు. అది ప్రజా రాజకీయాలు ఎదుర్కొంటున్న సవాలుగా, భారత ప్రజాస్వామ్యానికి ఓ హెచ్చరికగా చూడాలి.

**కేరళం ఎందుకు ప్రత్యేకం?** ఎందుకంటే ఈ దేశంలో కేరళం కేవలం ఓ రాష్ట్రం కాదు. భారతదేశంలో నిజమైన ప్రజా రాజకీయాలు ఎంతవరకు సాధ్యమో చూపించిన నేల. మార్కెట్ ఆధారిత అభివృద్ధి నమూనాల మధ్య కూడా ప్రజాకేంద్రిత పాలనకు స్థలం ఉంటుందని నిరూపించిన భిన్న అనుభవం. భూ సంస్కరణల నుంచి ప్రజా ఆరోగ్య వ్యవస్థ వరకు, అక్షరాస్యత నుంచి స్థానిక స్వపరిపాలన వరకు.. కేరళంలో కనిపించే అనేక సామాజిక పురోగతుల వెనుక దీర్ఘకాలిక ప్రజా ఉద్యమాల చరిత్ర ఉంది. ఆ చరిత్రలో వామపక్ష ఉద్యమాల పాత్ర అత్యంత కీలకమైనది. కేరళంలో కమ్యూనిస్టు ప్రభుత్వాలది కేవలం ఎన్నికల రాజకీయాలకే పరిమితమైన కృషి కాదు. సమాజాన్ని సమానత్వ దిశగా మార్చాలన్న సంకల్పం, ఆధిపత్యాలను ప్రశ్నించిన రాజకీయ సంస్కృతి, కార్మికుల గౌరవాన్ని సామాజిక చర్చల కేంద్రంగా తీసుకొచ్చిన ఉద్యమ సంప్రదాయం ఆ ప్రభుత్వాల సొంతం. విద్య, ఆరోగ్యం, సామాజిక, ఆహార భద్రత.. వీటిని ప్రభుత్వ పథకాలుగా కాకుండా ప్రజల హక్కులుగా స్థిరపరిచిన చరిత్ర కేరళం వామపపక్ష ప్రభుత్వాలది..కోవిడ్ సమయంలో ప్రపంచం ఎందుకు కేరళం వైపు చూసింది? వరదలూ విపత్తుల సమయంలో అక్కడి సామాజిక సంఘీభావం ఎందుకు ప్రత్యేకంగా కనిపించింది? ప్రజా ఆరోగ్య వ్యవస్థ, స్థానిక సంస్థలు, అక్షరాస్యత, మహిళల భాగస్వామ్యం.. ఇవన్నీ ఎందుకు జాతీయస్థాయిలో చర్చకు వచ్చాయి? ఎందుకంటే కేరళంలో అభివఅద్ధి అనేది కేవలం రహదారులు, భవనాలు, పెట్టుబడుల గణాంకాలతో కొలవబడలేదు. మనుషుల జీవన ప్రమాణాలతో కొలవబడింది. కేరళంలో వామపక్ష రాజకీయాల ప్రత్యేకత అదే. భారతదేశంలోని అనేక రాష్ట్రాల్లో ప్రజలు ప్రభుత్వాలను భయంతో చూస్తారు. కేరళలో మాత్రం ప్రభుత్వాన్ని ప్రశ్నించే సామాజిక సంస్కృతి బలంగా కనిపిస్తుంది. రాజకీయ భేదాలు తీవ్రంగా ఉన్నా, సామాజిక అంశాలపై చర్చించే ప్రజాస్వామ్య వాతావరణం కేరళంలో నేటికీ కూలిపోలేదు. అదే కారణంగా ఆ రాష్ట్ర రాజకీయాలు దేశవ్యాప్తంగా ఎప్పుడూ ప్రత్యేక ఆసక్తిని రేకెత్తిస్తాయి. ఎందుకంటే అక్కడ రాజకీయ పోరాటం కేవలం అధికార మార్పిడి కోసం కాదు, సమాజం ఏ విలువల మీద నిలబడాలి అన్న ప్రశ్న చుట్టూ సాగుతుంది. కానీ ఇప్పుడు ఆ కేరళం కూడా మారుతోంది. దేశవ్యాప్తంగా పెరుగుతున్న మత ధ్రువీకరణ రాజకీయాలు, కార్పొరేట్ మీడియా ప్రభావం, సోషల్ మీడియా ఆధారిత ప్రచార సంస్కృతి.. ఇవన్నీ కేరళం రాజకీయాల్లోనూ లోతుగా ప్రవేశిస్తున్నాయి. ఒకప్పుడు ప్రజా చర్చలతో నిండిన రాజకీయ వాతావరణంలో ఇప్పుడు భావోద్వేగాల ఆధారిత విభజనలు పెరుగుతున్నాయి. ఇదే ఇప్పుడు అసలు ఆందోళన. ఎందుకంటే దీనివలన కేరళంలో బలహీనపడేది కేవలం వామపక్షం మాత్రమే కాదు, ప్రజా సంక్షేమం, లౌకికత, సామాజిక న్యాయం ఆధారంగా నిర్మితమైన ఒక రాజకీయ సంస్కృతి కూడా.

**మీడియా -- కార్పొరేట్ రాజకీయాల కొత్త ఆధిపత్యం** భారత రాజకీయాల్లో గత రెండు దశాబ్దాల్లో అత్యంత ప్రమాదకరంగా మారిన పరిణామం ఏమిటంటే.. రాజకీయాలు క్రమంగా ప్రజల చేతుల నుంచి జారిపోయి, ప్రచార యంత్రాంగాల ఆధీనంలోకి వెళ్లడం. మీడియా ఒకప్పుడు అధికారాన్ని ప్రశ్నించే వేదికగా ఉండేది. ఇప్పుడు అందులో ఓ పెద్ద భాగం అధికారానికి ప్రతిధ్వనిగా మారుతోంది. వార్తలు క్రమంగా సమాచారంగా కాకుండా "నిర్మించబడిన రాజకీయ వాతావరణం"గా మారుతున్నాయి. టెలివిజన్ స్టూడియోలు ఇప్పుడు ప్రజాస్వామ్య వేదికలు కావు, రాజకీయ యుద్ధ గదులు. ప్రసార మాధ్యమాలు ఇప్పుడు కేవలం సమాచార వేదికలు కాదు, అభిప్రాయాల తయారీ కర్మాగారాలు. సోషల్ మీడియా ఆల్గోరిథమ్‌లు, డేటా ఆధారిత రాజకీయ మేనిప్యులేషన్, మత-కుల ధ్రువీకరణలు, వ్యక్తి ఆరాధన... ఇవన్నీ కలిసి ఓటరును ఒక పౌరుడిగా కాదు, రాజకీయ వినియోగదారుడిగా చూస్తున్నాయి. ఒక అబద్ధాన్ని వేలసార్లు వినిపించి నిజంలా నమ్మించే ప్రచార సాంకేతికత ఇప్పుడు రాజకీయాల్లో అత్యంత శక్తివంతమైన ఆయుధంగా మారింది. ప్రజలు ఏ విషయం




చర్చించాలి? ఎవరిని దేశభక్తులుగా చూడాలి? ఎవరిని శత్రువుగా భావించాలి? ఎవరిని ద్వేషించాలి? ఇవన్నీ ఇప్పుడు పెద్ద ఎత్తున మీడియా కథనాల ద్వారానే నిర్దేశించబడుతున్నాయి. కార్పొరేట్ పెట్టుబడులు మీడియాను క్రమంగా రాజకీయ-ఆర్థిక ప్రయోజనాల సాధనంగా మార్చుతున్నాయి. వార్తల కంటే ప్రచారం ముఖ్యమవుతోంది. వాస్తవాల కంటే "ఇంపాక్ట్" ముఖ్యమవు తోంది. నిజాన్ని తెలియజేయడం కంటే భావోద్వేగాలను రెచ్చగొట్టడం ఎక్కువ లాభదాయక వ్యాపారంగా మారింది. ఈ పరిస్థితిలో కార్పొరేట్ మద్దతు, మీడియా శక్తి, భారీ ఆర్థిక వనరులు లేని రాజకీయ శక్తులు సహజంగానే ఒత్తిడిని ఎదుర్కొంటాయి. ముఖ్యంగా ప్రజల మధ్య నిజాయితీగా పనిచేసే వామపక్ష రాజకీయాలకు ఇది మరింత కఠిన పరిస్థితి. ఎందుకంటే వామపక్షాల రాజకీయ పద్ధతి పూర్తిగా భిన్నమైనది. అవి ప్రజల భయాలను రెచ్చగొట్టి ఓట్లు అడగవు. మత విద్వేషాన్ని ఎన్నికల వ్యూహంగా మార్చవు. మీడియా సామ్రాజ్యాలను కొనుగోలు చేసి ప్రజాభిప్రాయాన్ని తయారు చేయవు. బూటకపు వాగ్దానాలతో నమ్మించాలని చూడవు. ప్రజల జీవిత సమస్యలను రాజకీయ ఎజెండాగా నిలబెట్టడమే వాటి పద్ధతి. కానీ ఇప్పుడు ప్రజల అసలు సమస్యలకంటే "ఇమేజ్" పెద్దది అయిపోయింది. విధానాలకంటే ప్రచారం ముఖ్యమవుతోంది. ప్రజాస్వామ్యం క్రమంగా మార్కెటింగ్ ప్రక్రియగా మారుతోంది. ఇది కేవలం వామపక్షాల సమస్య కాదు, మన ప్రజాస్వామ్యమే ఎదుర్కొంటున్న లోతైన సంక్షోభం. ఎందుకంటే ప్రజలు వాస్తవాల ఆధారంగా కాకుండా నిరంతర ప్రచార ప్రభావంలో నిర్ణయాలు తీసుకునే పరిస్థితి పెరిగినప్పుడు, ఎన్నికలు జరుగుతూనే ఉన్నా ప్రజాస్వామ్య ఆత్మ బలహీనపడుతుంది. అందుకే కేరళం ఎన్నికల ఫలితాలను కేవలం ప్రాంతీయ రాజకీయ పరిణామంగా చూడటం సరిపోదు. మన ప్రజాస్వామ్యంపై మీడియా-కార్పొరేట్ ఆధిపత్యం ఎంత వేగంగా పెరుగుతోందో తెలిపే హెచ్చరికగా గుర్తించాలి.

**వామపక్షాలకు కొత్త సవాళ్లు** అయితే ఈ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో వామపక్షాలు కూడా కొన్ని కీలక ప్రశ్నలను ఎదుర్కోవాల్సిన అవసరం ఉంది. భారత రాజకీయాల స్వభావం వేగంగా మారుతోంది. ప్రజల జీవన అనుభవాలు, రాజకీయాల భాష, కమ్యూనికేషన్ పద్ధతులు.. అన్నీ కొత్త రూపాలు దాలుస్తున్నాయి. ఈ మార్పులను మరింత లోతుగా అర్థం చేసుకుంటూ, కొత్త తరాలతో మరింత సజీవమైన సంబంధాలను నిర్మించాల్సిన అవసరం వామపక్షాల ముందుంది. ప్రజా ఉద్యమాల గొప్ప చరిత్ర వామపక్షాల బలం. ఆ చరిత్ర ప్రతి కొత్త తరంతో సంభాషించాలి. అందుకోసం ప్రజా రాజకీయాల అసలు స్వభావాన్ని కోల్పోకుండా కొత్త రాజకీయ భాషను నిర్మించాలి. ప్రచార రాజకీయాలను అనుకరించడం వామపక్షాల మార్గం కాదు. ప్రజల జీవిత సమస్యలను రాజకీయాల కేంద్రంగా నిలబెట్టడమే వాటి చారిత్రక బలం. అదే వామపక్ష రాజకీయాల అసలు పునాది. అయితే మారుతున్న కాలాన్ని అర్థం చేసుకుంటూనే, తమ ప్రజా రాజకీయాల ఆత్మను ఎలా విస్తరించాలి అన్నది వామపక్షాల ముందున్న అసలు ప్రశ్న. అయితే ఈ ప్రశ్నలన్నింటి మధ్య ఒక వాస్తవాన్ని మరిచిపోకూడదు. ఎన్నికల రాజకీయాలు ఎంతగా మారినా, ప్రచార యంత్రాంగాలు ఎంత శక్తివంతంగా మారినా.. ప్రజల నిజజీవిత వైరుధ్యాలు మాత్రం అలాగే మిగిలే ఉంటాయి. అది ఈ వ్యవస్థ లక్షణం. అదే ప్రజా రాజకీయాల అవసరాన్ని మళ్లీ మళ్లీ సజీవంగా ఉంచుతుంది. ప్రస్తుతం ఎల్‌డీఎఫ్ ఎదుర్కొన్న ఎదురుదెబ్బను కొందరు "వామపక్షాల అంతం"గా చిత్రీకరించడానికి ప్రయత్నించవచ్చు. కానీ చరిత్రను లోతుగా పరిశీలిస్తే, వామపక్ష ఉద్యమాలను కేవలం ఎన్నికల గెలుపోటములతో కొలిచిన అంచనాలు ఎన్నోసార్లు తప్పు అని నిరూపితమ య్యాయి. ఎందుకంటే కమ్యూనిస్టు ఉద్యమం అనేది కేవలం అధికారాన్ని నిర్వహించే రాజకీయ శక్తి మాత్రమే కాదు. సమాజంలోని అణగారిన వర్గాల ఆవేదనల నుంచి, కార్మిక-రైతాంగ పోరాటాల నుంచి, సమానత్వ ఆకాంక్షల నుంచి పుట్టిన ఒక చారిత్రక ప్రవాహం. వామపక్షాల ఉనికి కేవలం చట్టసభల్లో కాదు, ప్రజల దైనందిన జీవన పోరాటాల్లో ఉంటుంది. ప్రచార రాజకీయాలు కొంతకాలం ప్రజాభిప్రా యాన్ని ప్రభావితం చేయవచ్చు. డబ్బు, మీడియా, కార్పొరేట్ శక్తులు ఎన్నికల ఫలితాల ను మలచవచ్చు. కానీ ప్రజల నిజజీవిత సమస్యలను శాశ్వతంగా మౌనం చేయలేవు. ఎందుకంటే ఆకలి ఇంకా ముగియలేదు. నిరుద్యోగం ఇంకా ముగియలేదు. అసమానత ఇంకా ముగియ లేదు. అన్యాయం ఇంకా ముగియలేదు. అందువల్ల ప్రజా రాజ కీయాల అవసరం కూడా ముగియదు. కేరళ ఎన్నికల ఫలితాలను ఈ విస్తృత రాజకీయ నేపథ్యంలోనే చూడాలి. ఇది కేవలం ఒక ప్రభుత్వ ఓటమి కాదు. భారతీయ రాజకీయాలు ఎటు సాగుతున్నా యన్న ప్రశ్నను మరోసారి మన ముందుంచిన పరిణామం.


# ‘అమ్మో’రికా!




ఒకప్పుడు ‘అమెరికా’ అంటే ఆశ, అవకాశం, అభివృద్ధి. నేడు భారతీయ యువత నోట ‘అమ్మో... అమెరికా!’ అనే నిట్టూర్పు వినిపిస్తోంది. కలల నేల ఇప్పుడు అనిశ్చితి, ఆర్థిక భారాలు, కఠిన నిబంధనలు, అవమానకర వ్యాఖ్యలతో భయపెట్టే ప్రదేశంగా మారుతోంది. ‘అమెరికా వెళ్లాలి’ అనే లక్ష్యం, ‘వెళ్లాలా వద్దా?’ అనే ప్రశ్నగా మారింది. అంతేకాదు, ఈ మార్పు యువత ఆలోచనను కేవలం అమెరికాకే పరిమితం చేయకుండా, కెనడా, జర్మనీ, యుకే, ఆస్ట్రేలియా, ఐర్లాండ్, నెదర్లాండ్స్ వైపు కూడా మళ్లిస్తోంది.గతంలో అమెరికా స్వప్నం -- మంచి చదువు, ఉన్నత ఉద్యోగం, అధిక ఆదాయం -- భారతీయ మధ్యతరగతి యువతకు పరమావధిగా ఉండేది. కానీ 2025-26 నాటికి, ట్రంప్ పాలనలో ‘అమెరికన్ ఉద్యోగాలు అమెరికన్లకే’ నినాదంతో వలస విధానాలు కఠినతరమయ్యాయి. హెచ్-1బి వీసాపై లక్ష డాలర్ల ఫీజు ప్రతిపాదన, వేతన ఆధారిత ఎంపిక, మూడేళ్ల నిలిపివేత వంటి చర్యలు, ఇందులో 70 శాతం పైగా భారతీయులే ఉండటంతో, ప్రత్యక్షంగా వారి భవిష్యత్తును దెబ్బతీశాయి. లాటరీ విధానంలోని ఆశ కూడా అంతరించింది. ఈ నేపథ్యంలో ‘అమెరికా ఒక్కటే మార్గం’ అనే భావన కూలిపోతోంది.ఇటీవల ట్రంప్ చేసిన వ్యాఖ్యలు పరిస్థితిని మరింత వివాదాస్పదం చేశాయి. భారతీయ మహిళలు ప్రసవ పర్యాటకం ద్వారా పౌరసత్వం పొందుతున్నారనే ఆరోపణ, భారత్‌ను అవమానకర పదాలతో ప్రస్తావించడం, ఇది రాజకీయ ప్రకటనకు మించి, భారతీయుల గౌరవంపై దాడిగా మారింది. భారత ప్రభుత్వం కూడా దీన్ని అనుచితంగా ఖండించడం పరిస్థితి తీవ్రతను చూపిస్తోంది. యువత ఇప్పుడు ‘మనం ఆహ్వానితులమా, అనుమానితులమా?’ అనే సందేహంతో జీవిస్తోంది. దీని ప్రభావం గణాంకాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. 2025లో అమెరికా విశ్వవిద్యాలయాల్లో భారతీయ విద్యార్థుల నమోదు 45 శాతం తగ్గింది. వీసా మంజూరు గణనీయంగా తగ్గగా, వేలాది మంది నిపుణులు అనిశ్చితి కారణంగా స్వదేశానికి తిరిగి వస్తున్నారు. మరోవైపు, అమెరికా సంస్థలే తమ గ్లోబల్ సామర్థ్య కేంద్రాలను భారత్‌లో విస్తరిస్తున్నాయి. అంటే భారతీయ మేధస్సు అవసరం తగ్గలేదు. కానీ దాని భౌగోళిక కేంద్రం మారుతోంది. ఇతర దేశాలు కూడా సులభ వలస విధానాలు, నైపుణ్య వీసాలతో భారతీయ ప్రతిభను ఆకర్షిస్తున్నాయి. ఇది భారత్‌కు ఒక ద్వంద్వ పరిస్థితి. ఒకవైపు, తిరిగి వచ్చే ప్రతిభ, పెట్టుబడులు దేశానికి కొత్త బలం కావచ్చు. మరోవైపు, విదేశీ పంపకాలు, అంతర్జాతీయ అనుభవ మార్పిడి తగ్గే ప్రమాదం ఉంది. అయినా, కీలకమైన మార్పు ఇదే -- యువత గమ్యాన్ని మార్చుకుంటోంది, గమనాన్ని ఆపడం లేదు.ప్రపంచం మారుతోంది. వలసల దిశ మారుతోంది. ‘అమెరికా స్వప్నం’ను కాపాడే ప్రయత్నంలోనే అమెరికా, ఆ స్వప్నాన్ని ప్రపంచ యువతకు దూరం చేస్తోంది. అలాంటప్పుడు, భారతీయ యువతకు ఇది ఒక స్పష్టమైన హెచ్చరిక. అమెరికా ఇక ఏకైక భద్రమైన మార్గం కాదు. కానీ ఇది అదే సమయంలో గొప్ప అవకాశం కూడా. ‘అమ్మోరికా’గా మారుతున్న ఆ నేల స్థానంలో, ‘మన భారత్’ గట్టి ప్రత్యామ్నాయంగా నిలవాలి. దీనికి ప్రభుత్వం, పరిశ్రమలు, విద్యాసంస్థలు కలిసి -- దేశంలోనే ప్రపంచ స్థాయి పరిశోధన, ఉద్యోగాలు, ఆవిష్క రణలను నిర్మించాలి. అప్పుడే వలసల అనిశ్చితిని దేశీయ శక్తిగా మార్చగలం. ప్రపంచం వైపు చూపులు మళ్లుతున్న ఈ సమయంలో, భారత్ స్వప్నం మరింత బలంగా, మరింత గౌరవంగా అవతరించాల్సిన సమయం ఇది.

- కాలగిరి శ్రీనివాస్ రెడ్డి, 9010128884

# ‘పొదుపు’ సూత్రాల వెనుక!



వికసిత్ భారత్ అంటూ దేశాభివృద్ధిపై నిన్నమొన్నటి దాకా ఊదరగొట్టిన ప్రధాని మోడీ ఇప్పుడు ఉన్నపళంగా చేతులెత్తేశారు. మొన్న హైదరాబాద్ బహిరంగసభలో మాట్లాడుతూ దేశం చాలా క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నదని, పెను సంకటంలో కూరుకుపోతున్నదని సంకేతాలిచ్చారు. ప్రజలు తమ దేశభక్తిని నిరూపించుకొనే తరుణం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. పన్నెండేండ్ల పాటు అధికార పీఠంపై ఉన్న మోడీ.. యుద్ధాలను, అంతర్జాతీయ పరిస్థితులను ప్రస్తావిస్తూ.. దేశ ఆర్థిక పరిస్థితి అదుపుతప్పి పోతున్నదని చెప్పకనే చెప్పారు. ఇక ప్రభుత్వం చేయగలిగినది పెద్దగా లేదనే అర్థం ధ్వనించేలా బాధ్యతను దేశ ప్రజలపైకి నెట్టేసి చేతులు దులుపుకున్నారు. ప్రజల్లో ఆత్మస్థైర్యాన్ని నింపి, వారికి భరోసానివ్వాల్సిందిపోయి అనవసర భయాలను సృష్టించడం సరికాదు. దుబారా తగ్గించుకోవాలని ప్రజలకు కర్తవ్య బోధ చేశాడు సరే, అది ఎవరికి వర్తిస్తుంది? ఉన్నోళ్లకు. మరి పేదోడి పరిస్థితి? రెండుపూటల తిండికే దిక్కులేదు. ఇక అనవసర ఖర్చు కూడా ఉంటుందా? మోడీ దృష్టిలో ఉన్నోళ్లకే చేసిన హితబోధ తప్ప సామాన్యుల కొనుగోలు శక్తి పెంచే మాటలెక్కడా కనిపించలేదు. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధంతో పెట్రోల్, డీజిల్, గ్యాస్, ఎరువుల కొరత ఏర్పడుతుందన్నారు. "పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించని, ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించాలని, రైతులు యూరియా వినియోగం తగ్గించా లని, సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లాలని, ప్రజలు సొంత వాహనాలను కాకుండా మెట్రో, బస్సుల వంటి ప్రజా రవాణాను వినియోగించాలని" ఇలా... ప్రజలకు తొమ్మిది పొదుపు సూత్రాలను ఉపదేశించారు. ఎవరికి వారు జాగ్రత్త వహించి, స్వయం క్రమశిక్షణ ప్రదర్శించి ప్రస్తుతం దాపురించిన ఉపద్రవాల నుండి బయట పడాలని సూచించారు. ఈ మాటల వెనుక ఏదైనా ప్రమాదకరమైన ఆర్థిక సైరన్ మోగనుందా? అందుకే ఈ హిత వచనాలు పలికారా? అన్న సందేహం వస్తోంది. "స్వదేశీ వస్తువులనే వాడండి, ఆత్మనిర్భర్ భారత్‌ను నిర్మించండి" అని యువతను ఉద్దేశించి ప్రధాని ఉద్వేగభరిత ప్రసంగాలు చేసిన ప్రధాని..." దేశీయ సమస్యలను గాలికొదిలేసి... విదేశీ గడ్డలపై విలాసవంతమైన పర్యటనలు చేస్తూ రికార్డులు సృష్టిస్తున్నారు". పైపెచ్చు మధ్యతరగతిలో ఎక్కువగా విదేశీ పర్యటనల మోజు పెరిగిందని ఎద్దేవా చేశారు. స్వదేశీ పర్యాటక రంగం అభివృద్ధి చెందితే దేశ ఆదాయం పెరుగుతుందని ప్రవచించిన ఆయన చేసిన విదేశీ పర్యటనల ఖర్చు, ఆర్భాటం చూస్తుంటే.. "స్వదేశీ" అనేది కేవలం సామాన్య ప్రజల త్యాగాలకు పరిమితమైన మంత్రంగా, "విదేశీ" అనేది పాలకుల విలాసంగా మారిందని స్పష్టమవుతోంది. నిజమైన స్వదేశీ వాదం అంటే విదేశీ వస్తువులను బహిష్కరించమని ప్రజలకు చెప్పడం కాదు, దేశీయ వనరులను విదేశీ శక్తులకు అమ్మకుండా కాపాడటం. పాలకుల విదేశీ విహారాలకు అయ్యే ఖర్చులో సగం మొత్తాన్ని దేశీయ ఉపాధి కల్పనకు వెచ్చిస్తే.. భారత్ నిజంగానే ఆత్మనిర్భరంగా మారుతుంది. కానీ, ఆ దిశగా మన పాలకులు అడుగులు వేస్తారా? దేశంలో నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు సామాన్యుడి వెన్ను విరుస్తుంటే..వాటిని నియంత్రించాల్సిన ప్రధాని అంతర్జాతీయ యుద్ధ పరిస్థితులను సాకుగా చూపడం బాధ్యతా రాహిత్యానికి నిదర్శనం. యుద్ధమనేది ప్రపంచవ్యాప్త సమస్యే. అయినప్పటికీ, మిగిలిన దేశాలతో పోలిస్తే భారత్‌లో ధరల పెరుగుదల వేగానికి కారణం కేంద్రం అనుసరిస్తున్న విధానాలే. కానీ, యుద్ధం పేరు చెప్పడం తన వైఫల్యాన్ని ఇతరుల మీదకు నెట్టడమే. ప్రభుత్వం ఇప్పటికైనా కార్పొరేట్ లాభాల కోసం కాకుండా, సామాన్యుడి జీవన ప్రమాణాల కోసం పనిచేయాలి. పెట్రో ఉత్పత్తులపై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించి, నిత్యావసరాల ధరలను అదుపు చేయడంలో చిత్తశుద్ధిని చాటుకోవాలి. యుద్ధం పేరుతో సామాన్యుడి ఆకలిని విస్మరించడం ప్రజాస్వామ్య ప్రభుత్వ లక్షణం కాదు. కరోనా నాటి సంక్షోభాన్ని గుర్తు చేసిన ప్రధాని మళ్లీ అప్పటి పద్ధతులను పాటించాల్సిన పరిస్థితులు వచ్చాయని ప్రకటించారు. యుద్ధ సమయాలను మినహాయిస్తే స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఏ ప్రధాని కూడా ఇలా బహిరంగ సభలో దేశ ఆర్థిక సంకటాన్ని ప్రస్తావించి, పరిష్కార బాధ్యతను ప్రజలపైకి తోసేయలేదు. బహుశా ఇదే మొట్టమొదటిసారి... ఈ అత్యంత దురదృష్ట ఘటనకు పరేడ్‌గ్రౌండ్ వేదికైంది. సంకీర్ణ శకంలో, 1989లో విదేశీ మారక ద్రవ్య నిల్వలు అడుగంటి, 47 టన్నుల బంగారాన్ని కుదువ పెట్టాల్సి వచ్చినప్పుడు కూడా అప్పటి ప్రధాని చంద్రశేఖర్ మోడీలాంటి పిలుపునివ్వలేదు.

# భవసాగర తీరాలు

భవసాగరాన్ని సులువుగా ఈదుతూ..
విజయ తీరాల్ని ముద్దాడటానికి..
అభద్రత, దురాశ, వస్తువ్యామోహం..
సోమరితనం, అతి విశ్వాసం లాంటి..
శరీర బరువులను తగ్గించుకో..
పొగడ్తల అలలను తప్పించుకో..
పక్క వాడిని చూసి బుద్ధి తెచ్చుకో..
ఈర్ష్య, అసూయల కొవ్వును కరిగించుకో..
సానుకూల దృక్పథ ట్యైరును..
నడుముకు గట్టిగా చుట్టేసుకో..
కరుణ, దయల ఆసరా తీసుకో..
మానవీయ శ్వాసను అదుపులో ఉంచుకో..
చేయూత నిచ్చిన చేతులకు దండం పెట్టుకో..
తీరం చేరాక తెప్ప తగిలేయవద్దని తెలుసుకో !

మధుపాళీ

## వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే & తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)




**ఎన్టీఆర్ డిస్టిక్** పెనుగంచిప్రోలు మండలం, ముండ్లపాడు గ్రామంలో హనుమాన్ జయంతి సందర్భంగా గ్రామస్తులు నిర్వహించిన వేడుకల్లో శాసనసభ్యులు ఒ తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గ్రామానికి చెందిన కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానం మాజీ డైరెక్టర్ చంద్రుపట్ల లక్ష్మీనరసింహారావు , వారి సతీమణి హైమావతి జ్ఞాపకార్థంగా గ్రామ ప్రజల అవసరార్థం వాటర్ ట్యాంకును బహుకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) రిబ్బన్ కటింగ్ చేసి వాటర్ ట్యాంకును ప్రారంభించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. గ్రామ అభివృద్ధికి సహకరిస్తూ ప్రజలకు ఉపయోగపడే విధంగా వాటర్ ట్యాంకును అందించడం అభినందనీయ మని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ఉమ్మినేని పుల్లారావు, గుత్తా హనుమంతరావు, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సంజీవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాలబాలికల సాధికారతతోనే ఉజ్వల భవిష్యత్తు: సిడిపిఓ మెహబూబి

**నెలటూరు-2 అంగన్వాడి కేంద్రంలో 'కిశోర వికాసం' కార్యక్రమం**




**గూడూరు** నెల్లూరు జిల్లా గూడూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని విందూరు సెక్టార్ , నెలటూరు–2 అంగన్వాడి కేంద్రంలో కిశోర బాలబాలికల సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా చేపట్టిన 'కిశోర వికాసం' కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా "నా అవసరాలు – మన సవాళ్లు" అనే అంశంపై పిల్లలకు ప్రత్యేక అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సిడిపిఓ మెహబూబి మాట్లాడుతూ.. బాలబాలికలు తమ వ్యక్తిగత మరియు సామూహిక సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలని, ఆత్మవిశ్వాసంతో పాటు వ్యక్తిగత శుభ్రతను పాటించాలని సూచించారు. ప్రస్తుత సమాజంలో మహిళలపై పెరుగుతున్న దాడులు, వేధింపుల నేపథ్యంలో కిశోర బాలికలు మానసిక ధైర్యాన్ని పెంపొందించుకోవాలని, ఉన్నత విద్య ద్వారానే సామాజిక మార్పు సాధ్యమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ బి. హైమావతి, అంగన్వాడి కార్యకర్తలు ఉమాదేవి, శోభారాణి, రమణ కుమారి, కామాక్షి మరియు పిల్లల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కత్తి రవి దంపతుల ఆధ్వర్యంలో షర్బత్ పంపిణీ



**శ్రీకాళహస్తి మే 12:** శ్రీకాళహస్తిలో ప్రస్తుతం ఎండలు మండిపోతున్నాయి, ఈ సమయంలో ప్రజలకు చల్లని షర్బత్ పంపిణీ చేయడం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది, ఆ సమయంలో ప్రజలకు పంపిణీ చేసినారు రాష్ట్రంలో ఉన్న ఎండల దృష్ట్యా నిత్యం దైవదర్శనానికి వచ్చిన భక్తులకు శ్రీ శీతాలాంబ ఆలయం వద్ద కత్తి రవి కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో షర్బత్ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీతాలాంబ ఆలయ ప్రెసిడెంట్ పాలమంగళం రవి, పాలమంగళం ప్రకాష్, గోపి, సుబ్బయ్య, ఎస్ బత్తిరెడ్డి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొనడం జరిగింది.

## మనుబోలు వద్ద రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

**హెల్మెట్ లేని ప్రయాణం ప్రాణాంతకం**




**గూడూరు** నెల్లూరు జిల్లా మనుబోలు వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో సైదాపురం మండలం రాగనరామాపురానికి చెందిన కొత్తలూరు కళ్యాణ్ (22) అనే యువకుడు మృత్యువాత పడ్డాడు. మంగళవారం ఉదయం పని నిమిత్తం సైదాపురం నుండి నెల్లూరుకు బైక్‌పై బయలుదేరిన కళ్యాణ్, మనుబోలు సమీపంలోకి రాగానే ప్రమాదానికి గురయ్యాడు. అయితే, బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొందా లేక ఏదైనా గుర్తుతెలియని వాహనం అతడిని ఢీకొట్టిందా అన్నది ఇంకా స్పష్టం కాలేదు. ఈ ప్రమాద సమయంలో కళ్యాణ్ తలకు హెల్మెట్ ధరించకపోవడంతో, తలకు బలమైన గాయం తగిలి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న మనుబోలు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఒకవేళ హెల్మెట్ ధరించి ఉంటే ఈ యువకుడు ప్రాణాలతో బయటపడేవాడని స్థానికులు చర్చిస్తున్నారు. మనుబోలు పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

# సుస్థిరాభివృద్ధికి పునాదులు వేస్తున్న ఇంజనీర్ల సేవలు

**(13 మే "ఐఈఈఈ గ్లోబల్ ఇంజనీరింగ్ దినోత్సవం" సందర్భంగా)**

ప్రపంచ మానవాళి సరళ జీవన విధానానికి గట్టి పునాదులు వేస్తున్న ఇంజనీర్ల సేవలను గుర్తించడంతో పాటు వారి ఆధునిక ఆవిష్కరణలను ఆకళింపు చేసుకోవడానికి ఉద్దేశించబడిన వేదికలుగా ప్రతి ఏటా 13 మే రోజున ప్రపంచవ్యాప్తంగా "ఐఈఈఈ గ్లోబల్ ఇంజనీరింగ్ దినోత్సవం" పాటించడం ఆనవాయితీగా మారింది. ప్రపంచంలోనే అతి పెద్ద సాంకేతిక నిపుణులతో కూడిన సంస్థగా 160 దేశాల్లో విస్తరించి 3.5 లక్షల సభ్యులతో "ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్స్ (ఐఈఈఈ)" 1973లో అవతరించి అప్రతిహతంగా కొనసాగుతున్నది. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ లాంటి ఇంజనీరింగ్ విభాగాల్లో యువత పెద్ద ఎత్తున ప్రవేశించి, ఆయా రంగాల్లో విశేష కృషి జరపాలనే లక్ష్యంతో ఈ దినోత్సవం వేడుకగా జరుపుకుంటున్నాం.

ఇంజనీరింగ్ అద్భుత ఆవిష్కరణలు:

చేతిలో వైకుంఠాన్ని చూపుతున్న స్మార్ట్‌ఫోన్లు, అతి పెద్ద ఆకాశహర్మ్యాలు, అంతరిక్ష ప్రయాణాలు, అత్యాధునిక విమానాశ్రయాలు, డ్రోన్ టెక్నాలజీ ఫోటోగ్రఫీలు లాంటి అనేక విప్లవాత్మక మార్పులకు ఇంజనీర్లు పునాదులు వేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా సృజనశీల ఆవిష్కరణలను ప్రోత్సహించడం, ఇంజనీరింగ్ సంబంధ విద్యార్థులు, అధ్యాపకులు, టెక్నోక్రాట్లు, నిపుణులు, పరిశోధకులను ఏకం చేసి మెరుగైన సాంకేతికతను సుసాధ్యం చేయడానికి ఈ వేదికలు ఉపయోగపడుతున్నాయి. సుస్థిర సమాజ నిర్మాణం కోసం ఇంజనీర్లు చేస్తున్న కృషిని ప్రశంసించడానికి మార్చి 3 – 5 రోజుల్లో "ప్రపంచ ఇంజనీర్ల దినం"" జూన్ 23 – జూలై 07 వరకు "ఐఈఈఈ మహిళా ఇంజనీర్ల దినం" కూడా పాటించడం జరుగుతోంది.

మానవ కేంద్రిత ఇంజనీరింగ్ విద్య :

ఆవిష్కరణలు, డిజిటలైజేషన్ ద్వారా సుస్థిర భవిష్యత్తు కోసం స్మార్ట్ ఇంజనీరింగ్ అనుసంధానం చేస్తున్న తీరు అనన్య సామాన్యం. సుస్థిరాభివృద్ధి సాధనలో ఇంజనీర్ల పాత్ర వెలకట్టలేనిది. ఇంజనీరింగ్ అభివృద్ధికి బేషరతుగా మద్దతు ఇవ్వడానికి, వారిని పౌర సమాజం సముచితంగా గుర్తించడానికి అన్ని ప్రయత్నాలు నిరంతరం జరగాలి. 2026లో 17వ ఐఈఈఈ గ్లోబల్ సదస్సు "ఎడ్యుకాన్" పేరుతో నిర్వహించడానికి "మానవ కేంద్రిత ఇంజనీరింగ్ విద్య : సుస్థిర ఆవిష్కరణలు, ఏఐ – డిజిటల్ మార్పులకు మానవీయ నాయకత్వాలను శక్తివంతం చేయడం" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. నేటి యువత సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్/ఇంగ్లీష్, మ్యాథమెటిక్స్ రంగాల్లో (స్టెమ్ – ఎస్‌టిఈఎం) ముందుకు వస్తేనే మానవాళి అభివృద్ధి సుసాధ్యం అవుతుందని గమనించాలి.

శాస్త్ర సాంకేతిక శాస్త్ర పరిశోధనలతో నేటి ఏఐ డిజిటల్ ప్రపంచం మరో లోకంలోకి ప్రవేశిస్తున్నది. వీటి పుణ్యాన భూమి కుగ్రామంగా మారింది. దూరాలు, సరిహద్దులు చెరిగి పోయాయి. అరచేతిలో స్మార్ట్ వైకుంఠం వెలసింది. మితిమీరిన టెక్నాలజీ రీతులతో యువత కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. ఆధునిక ఏఐ–డిజిటల్ టెక్నాలజీ కత్తికి రెండు వైపులా పదును పెరుగుతోంది. టెక్నాలజీతో ప్రయోజనంతో పాటు దురుపయోగం కూడా జరుగుతోంది. కట్టింగ్–ఎడ్జ్ టెక్నాలజీతో మానవాళి సుస్థిరాభివృద్ధి దిశగా మాత్రమే అడుగులు వేయాలని, ప్రపంచ శాంతికి పునాదులు జరగాలని కోరుకుందాం, నేటి యువతను ఇంజనీరింగ్ విద్యలోకి ప్రవేశించే విధంగా ప్రయత్నాలు చేద్దాం.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

# భక్తిశ్రద్ధలతో ఇల్లూరు 'శుక్రబడయ్యా స్వామి' ఆలయ పునఃప్రారంభం

**హనుమాన్ జయంతి వేళ వైభవంగా అన్నదానం.. బెల్లం అభిషేకంతో వానలు కురిపించే మహిమాన్వితుడు!**




**గార్లదిన్నె మే 12 :** అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం ఇల్లూరు గ్రామంలో వెలసిన మహిమాన్వితుడు శ్రీ శుక్రబడయ్యా స్వామి దేవస్థానం నూతన శోభను సంతరించుకుంది. చెరువు కట్టపై కొలువై ఉండి, గత 150 ఏళ్లుగా గ్రామస్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న ఈ స్వామివారి ఆలయం శిథిలావస్థకు చేరడంతో, గ్రామ ప్రజలందరూ ఏకమై తమ సొంత చొరవతో ఆలయాన్ని అద్భుతంగా పునర్ నిర్మించారు. అన్నదాన కార్యక్రమం హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని నేడు నూతనంగా నిర్మించిన ఆలయాన్ని భక్తుల సందర్శనార్థం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులందరి సహకారంతో భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

150 ఏళ్ల చరిత్ర.. బెల్లం అభిషేకంతో కురిసే వర్షాలు!

శుక్రబడయ్యా స్వామివారి మహిమ గురించి గ్రామస్తులు కథలు కథలుగా చెప్పుకుంటారు. ముఖ్యంగా కరువు ప్రాంతమైన అనంతపురంలో, వర్షాలు లేక పంటలు ఎండిపోయే సమయంలో స్వామివారే తమకు దిక్కని వారు నమ్ముతారు. వర్షాలు రాకపోతే ప్రతి ఏటా గ్రామస్తులందరూ గ్రామం నుండి పెద్ద ఎత్తున చక్కెర, బెల్లం ముక్కలతో ఊరేగింపుగా తరలివస్తారు. స్వామివారికి భక్తిశద్ధలతో బెల్లంతో అభిషేకం చేసిన వెంటనే ఆకాశం మేఘావృతమై భారీ వర్షాలు కురుస్తాయని, ఇది గత దశాబ్దాలుగా జరుగుతున్న నిజమని భక్తులు నమ్మకంతో చెబుతున్నారు. కార్యక్రమ నిర్వాహకులుఈ పునర్నిర్మాణ పనులను మరియు అన్నదాన కార్యక్రమాన్ని దిగ్విజయం చేయడంలో గ్రామస్తులు తూర్పింటి చిన్న నల్లప్ప (అలియాస్ మూగన్నా), నగదాని నారాయణస్వామి, తూర్పింటి నవీన్, రామాంజనేయులు, నరసింహుడు మరియు ఇతర గ్రామ ప్రముఖులు కీలక పాత్ర పోషించారు. గ్రామ ప్రజలందరి ఐకమత్యం, ఆర్థిక సహకారంతోనే స్వామివారి ఆలయం ఇంత భవ్యంగా రూపుదిద్దుకుందని వారు సంతోషం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో గ్రామంలోని యువకులు, మహిళలు, వృద్ధులు భక్తి ప్రపత్తులతో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు. భవిష్యత్తులో కూడా స్వామివారి సేవలో గ్రామం సుభిక్షంగా ఉండాలని వారు ఆకాంక్షించారు.

# నిర్దేశించిన సమయంలోగా ఇండ్ల గణనను పూర్తిచేయాలి

**ఇండ్ల గణనను పారదర్శకంగా చేపట్టాలి**
**ఏలూరు లో ఇంటింటికీ వెళ్లి ఇండ్ల గణనను పరిశీలించిన జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి**



**ఏలూరు, మే, 12.** జిల్లాలో జనగణనలో భాగంగా చేపట్టిన ఇండ్లగణనను ఈనెల 30వ తేదీలోగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి సిబ్బందిని ఆదేశించారు. స్థానిక 39వ డివిజన్ లోని ఏటిగట్టు వద్ద నగరపాలక సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చేస్తున్న ఇండ్లగణనను మంగళవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివరాలు అందిస్తున్న ప్రజలతో కలెక్టర్ మాట్లాడారు. గణన చేస్తున్న సిబ్బంది వివరాలను అడుగుతున్న తీరు, సిబ్బంది హెచ్ ఎల్ బి యాప్ లో వివరాలను నమోదు చేస్తున్న తీరుని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో ఇండ్లగణనను ఈనెల 30వ తేదీలోగా పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించిందని, అందుకు అనుగుణంగా ఇండ్లగణనను వేగవంతం చేయాలన్నారు. గణన సిబ్బందికి రోజూ వారీ నిర్దేశించిన లక్ష్యాల మేర, ఏ రోజు లక్ష్యాన్ని అదేరోజు పూర్తి చేయాలన్నారు. ఇండ్లగణన చేసే సిబ్బంది ప్రజలతో మర్యాదగా ప్రవర్తించాలని, అవసరమైన మేరకే వివరాలను తెలుసుకుని యాప్ లో అప్లోడ్ చేయాలన్నారు. కలెక్టర్ వెంట ఏలూరు నగరపాలక సంస్థ కమీషనర్ ఏ . భానుప్రతాప్, తహసీల్దార్ గాయత్రి, గణన సిబ్బంది ప్రభృతులు పాల్గొన్నారు.

# ఇంటర్, ఎస్సెస్సీ ఫెయిల్ ఐన విద్యార్థులు రెమెడీయల్ క్లాసుల ద్వారా ప్రత్యేక బోధన

**ఏలూరులో ఇంటర్, ఎస్సెస్సీ రెమెడీయల్ తరగతులను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి**
**రెమిడీయల్ తరగతులకు హాజరుకాని విద్యార్థులకు ఫోన్ చేసి వారి తల్లితండ్రులతో మాట్లాడిన కలెక్టర్**




**ఏలూరు,మే, 12 .** జిల్లాలో ఎస్సెస్సీ, ఇంటర్మీడియేట్ పరీక్షలలో ఫెయిల్ ఐన విద్యార్థులకు ప్రత్యేకంగా రెమెడీయల్ తరగతులు నిర్వహించి ఉతీర్ణులయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కొత్తదిబ్బలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోను, 12 పంపుల సెంటర్ వద్ద గల గాంధీనగర్ నగరపాలక సంస్థ హై స్కూల్ లో నిర్వహిస్తున్న రెమెడీయల్ తరగతులను మంగళవారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతులకు హాజరుకాని విద్యార్థులకు ఫోన్ చేసి వారి తల్లితండ్రులతో కలెక్టర్ మాట్లాడారు. రెమెడీయల్ తరగతులకు విద్యార్థులు రాకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఇంటర్, ఎస్సెస్సీలో ఫెయిల్ ఐన విద్యార్థులకు ప్రత్యేకంగా రెమెడీయల్ నిర్వహించి వారిని సప్లిమెంటరీ పరీక్షలలో ఉతీర్ణులు అయ్యేలా ఉపాధ్యాయులు,అధ్యాపకులు కృషి చేస్తున్నారని, తమ పిల్లలను రెమెడీయల్ క్లాసులకు తప్పనిసరిగా పంపించాలని తల్లితండ్రులను కలెక్టర్ ఫోన్ ద్వారా కోరారు. విద్యార్థులకు బోదిస్తున్న టెక్స్ట్ బుక్స్ పరిశీలించి, ఉపాధ్యాయ ులను బోధన తీరును కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 3488 మంది, రెండవ సంవత్సరం పరీక్షలలో 2768 మంది మొత్తం 6256 మంది ఫెయిల్ అయ్యారని, అదేవిధంగా 10వ తరగతిలో 3654 మంది ఫెయిల్ అయ్యారన్నారు. ఏ ఏ సబ్జెక్టులలో ఫెయిల్ అయ్యారో తెలుసుకుని, వారికి ఆ సబ్జెక్టులను పూర్తిగా అర్థమయ్యేలా రెమెడీయల్ తరగతులలో బోధన చేయాలన్నారు. ఇంటర్మీడియేట్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 21వ తేదీ నుండి, 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 29వ తేదీ నుండి ప్రారంభమవుతాయన్నారు. రెమెడీయల్ తరగతులకు విద్యార్థులు అందరూ హాజరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, హాజరుకాని విద్యార్థులకు, వారి తల్లితండ్రులకు ఫోన్ చేసి తప్పనిసరిగా తరగతులకు హాజరయ్యేలా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఇంటర్మీడియట్ శాఖ ఆర్ఐఓ యోహాన్, ఒకేషనల్ విద్యా శాఖాధికారి టి. శేఖర్ బాబు, డీఈఓ వెంకటలక్ష్మమ్మ, తహసీల్దార్ గాయత్రి, ప్రభృతులు పాల్గొన్నారు.

## పని ప్రదేశంలో ఉపాధి శ్రామికులతోసమావేశం లో మాట్లాడిన ఏపిఓ చిరంజీవి ఏపీఓ చిరంజీవి!...



**పోలవరం జిల్లా :** పోలవరం జిల్లా అడ్డతీగల మండలం, ఎల్లవరం పంచాయతీ,నాయుడు పాకల గ్రామంలో, ఉపాధి హామీ పనుల కోసం,ఏ పీ ఓ చిరంజీవి ఉపాధి శ్రామికులకు వివరణ ఇస్తూ ప్రతి ఒక్క జాబు కార్డు ఉన్న ప్రతి కుటుంబ సభ్యులు పనికి రావాలంటూ, పనికి రాని ఎడల జాబు కార్డు రద్దు చేయబడుతుందని, దానికి బాధ్యులు మీరే అని అని, ఉపాధి శ్రామికులతో సమావేశంలో ఏపీవో చెప్పడం జరిగినది. ఒక సంవత్సర కాలంలో ఒక జాబు కార్డులో ఉన్న పని దినాలు 125 రోజులు పని చేసుకోవచ్చు అని వివరణ ఇచ్చారు. అలాగే ఒక రోజు కనీస వేతనం కొలతల ప్రకారం పని చేస్తే ఒక శ్రామికునికి రోజుకు వచ్చే వేతనం,307 రూపాయలు వస్తాయని శ్రామికులకు వివరించారు. అలాగే మన ఉపాధి హామీ పథకం పేరు "వి బి జి రామ్ జి " శ్రామికులకు పూర్తిగా వివరణ ఇచ్చారు. ఈ సమావేశంలో ఏపీవో చిరంజీవి, ఎంపిటిసి, వార్డ్ మెంబర్స్, కూటమి నాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి శ్రామికులు, రైతులు,హాజరైనారు.

# తోకగుట్ట గంగమ్మకు వైభవోపేతంగా భక్తి శ్రద్ధలతో పూజలు పొంగళ్ళు





**తిరుపతి మే-12రామచంద్రాపురం :**మండలంలోని గంగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని తోక గుట్టలో వెలసిన గ్రామదేవత తోకగుట్ట గంగమ్మకు వైభవోపేతంగా ప్రత్యేక పూజలు చేసి భక్తిశ్రద్ధలతో పొంగళ్ళు పెట్టి తమ మొక్కులు చెల్లించుకున్నారు ముందుగా గ్రామస్తులు ప్రతి ఇంటికి ఒక పొంగళ్ళు చొప్పున మహిళలు ఊరేగింపుగా అమ్మవారి దేవాలయం చేరుకుని భక్తి తో గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి పొంగళ్ళు పెట్టారు అనంతరం అమ్మవారికి పసుపు కుంకుమ పూలతో విశేషంగా అలరించి అంబలి నైవేద్యం బలి నివేదనలతో తమ మొక్కులు తీర్చుకున్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి యేటా తిరుపతి లోని తాతయ్య గుంట గంగమ్మ జాతర ను పురస్కరించుకుని మా ఊరిలో గ్రామదేవత తోకగుట్ట గంగమ్మతల్లికి బంధుమిత్రులతో కలిసి అందరూ కులాలకు, మతాలకతీతంగా పార్టీలకతీతంగా ఎంతో భక్తి శ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు అమ్మవారి ఆలయ నిర్మాణం అభివృద్ధికి నిధులు సేకరించి ఆలయం రూపురేఖలు మార్చి భక్తి భావాలు పంపించేందుకు ప్రతి ఒక్కరు కంకణదారులు ఉంటామని అమ్మవారి కృపకు పాత్రులు అవుతామని అదేవిధంగా తమిళనాడు నుంచి వచ్చే శ్రీవారి భక్తులకు ఆలయ కమిటీ సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు శ్రీకరం చుట్టూ జరుగుతుందని ఈ ఆలయం ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు కార్యక్రమంలో శ్యామ్ సుందర్ రెడ్డి, తంజావూరు మధు, మనోహర్ రెడ్డి, సింగ్ గరుడాద్రి నాయుడు,సింగ్ హరీష్, తంజావూరు సునీల్, పెనుగొండ రాజశేఖర్, పెనుగొండ వీరభద్ర, మనోహర్, తంజావూరు రవి, వెంకటేష్ నాడారు, మనోహర్ నాడారు, ధనశేఖర్ నాడారు, బాదూరు వంశీబాల, ఠాగూర్ మహేష్,బాదూరు ఉధిత్ రాజ్ ,మహిళలు నీలమ్మ, సునీత,మునెమ్మ ,లక్ష్మమ్మ, గీత ,కోటమ్మ,లత, నదియా, కావ్య, దివ్య, తేజ,రూప,కళ, మౌనిక తదితరులు పాల్గొన్నారు

# నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ దేశ యువత భవిష్యత్తుపై జరిగిన దాడి

**విద్యా మాఫియాను ఉక్కుపాదంతో అణచివేయాలి --**
**దోషుల ఆస్తులు స్వాధీనం చేసుకోవాలి**
**పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకినాని.**



**ఏలూరు, మే 12.** రాజస్థాన్‌లో వెలుగులోకి వచ్చిన నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ఘటన సాధారణ విషయం కాదని, ఇది దేశ యువత భవిష్యత్తుపై జరిగిన కుట్రపూరిత దాడి అని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకినాని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సీబీఐతో సమగ్ర విచారణ జరిపించి, విద్యా మాఫియాకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మంగళవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, లక్షలాది మంది విద్యార్థులు తమ తల్లిదండ్రుల కష్టార్జిత డబ్బుతో సంవత్సరాల తరబడి శ్రమించి పరీక్షలకు సిద్ధమవుతుంటే, కొందరు డబ్బు దందా కోసం ప్రశ్నాపత్రాలను లీక్ చేసి విద్యా వ్యవస్థనే బజారులో అమ్మేస్తున్నారని మండిపడ్డారు. ఇది కేవలం లీకేజీ ఘటన కాదు, నిజాయితీగా చదివే విద్యార్థుల ఆశలు, కలలను హత్య చేసే నేరమన్నారు. నీట్ వంటి జాతీయ స్థాయి పరీక్షల్లో వరుసగా జరుగుతున్న లీకేజీలు కేంద్ర ప్రభుత్వ వైఫల్యాన్ని బహిర్గతం చేస్తున్నాయని విమర్శించారు. పరీక్షల భద్రత కాపాడలేని ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుకు ఎలా హామీ ఇస్తుందని ప్రశ్నించారు. డబ్బు, రాజకీయ అండదండలతో నడుస్తున్న విద్యా మాఫియా దేశ విద్యా వ్యవస్థను పూర్తిగా కలుషితం చేస్తోందన్నారు. ఈ ఘటనలో ప్రమేయం ఉన్న అధికారులు, మధ్యవర్తులు, మాఫియా గ్యాంగులు, రాజకీయ సంబంధాలు ఉన్న వారందరినీ వెంటనే అరెస్ట్ చేసి దేశద్రోహం, క్రిమినల్ కుట్ర కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దోషుల ఆస్తులను స్వాధీనం చేసుకొని, జీవిత ఖైదు వంటి కఠిన శిక్షలు విధించాలని కోరారు.

భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పరీక్షా వ్యవస్థలో పూర్తిస్థాయి సంస్కరణలు తీసుకురావాలని, పారదర్శకత మరియు అత్యాధునిక సాంకేతిక భద్రతతో పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తు కాపాడే వరకు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని కాకి నాని హెచ్చరించారు.

# చిట్వేల్‌లో మిన్నంటిన హనుమన్నామ స్మరణ

**బ్రాహ్మణ వీధిలో భక్తిశ్రద్ధలతో**
**హనుమజ్జయంతి వేడుకలు**
**రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు.. భారీగా**
**తరలివచ్చిన భక్తులు**





**చిట్వేల్, మే 12:** :మండల కేంద్రమైన చిట్వేల్ పట్టణంలో శ్రీ హనుమజ్జయంతి వేడుకలు మంగళవారం అత్యంత వైభవంగా జరిగాయి. పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో వెలసిన శ్రీ ఆంజనేయస్వామి వారి ఆలయంలో వేమన యోజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహోత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచే ఆలయ పరిసరాలు భక్తుల రాకతో సందడిగా మారాయి.

-శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు

జయంతిని పురస్కరించుకుని ఆలయంలో ఉదయం 8 గంటల నుంచే ఆధ్యాత్మిక క్రతువులు ప్రారంభమయ్యాయి. అర్చకుల వేదమంత్రోచ్ఛారణల మధ్య గణపతి పూజ, పుణ్యాహవాచనం, నవగ్రహ ఆరాధనలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి విశేషంగా రుద్రాభిషేకం ఆకు పూజలు నిర్వహించి, నూతన వస్త్రాలతో సుందరంగా అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు.

-భారీ అన్నదానం.. ప్రసాద వితరణ

మధ్యాహ్నం వేళ ఆలయ ప్రాంగణంలో భారీగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వందలాది మంది భక్తులు స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహక కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. భజన బృందాల కీర్తనలు, హనుమాన్ చాలీసా పారాయణంతో బ్రాహ్మణ వీధి ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

-వైభవంగా గ్రామోత్సవం

సాయంత్రం 5 గంటలకు స్వామివారి ఉత్సవ మూర్తిని రంగురంగుల పుష్పాలతో అలంకరించిన వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటాల నడుమ స్వామివారు పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు తమ ఇంటి ముందర స్వామివారికి హారతులు ఇచ్చి ప్రసాదాలు సమర్పించుకున్నారు. ఈ వేడుకలను విజయవంతం చేసిన భక్తులకు, సహకరించిన దాతలకు వేమన యోజన సంఘం నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేశారు. భజనలు, ఆధ్యాత్మిక ప్రసంగాలతో చిట్వేల్ పట్టణమంతా మారుతి నామస్మరణతో మారుమోగింది.

# ప్రేమించి మోసం చేశాడని గిరిజన యువతి ఆత్మహత్యాయత్నం


**మదనపల్లి ఆస్పత్రికి తరలింపు-యువతికి**
**న్యాయం చేయాలని టిడిపి శ్రేణుల డిమాండ్.**



**తంబళ్లపల్లె మే 12 ;** ఓ యువకుడు ఓ గిరిజన యువతి ని ప్రేమించి పెళ్ళి చేసుకుంటానని నమ్మించి మోసం చేయడంతో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన తంబళ్లపల్లె మండలం లో వెలుగు చూసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గోపి దీన్నే పంచాయితీ బల్లాపురం పల్లె కు చెందిన ఓ గిరిజన యువతి (19) ఇంటర్మీడియట్ వరకు చదువుకొని ఇంటి వద్ద ఉండేది. అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు గతంలో ఆ యువతి పాఠశాల చదువుకునే సమయం నుండే మాయ మాటలు చెప్పి ప్రేమ పేరుతో నమ్మించాడు. ప్రేమ పేరుతో ఆ యువతిని పెళ్లి చేసుకుంటానని యువకుడు నమ్మించి లొంగదీసుకున్నాడు. అతని మీద నమ్మకంతో తన బంగారు నగలు అతనికి ఇచ్చింది. తల్లిదండ్రులు నగల విషయమై యువతిని నిలదీయగా ఆ యువకుడు నుండి నగలు తిరిగి తెచ్చుకుంది. అనంతరం ఇరువురు ప్రేమ పేరుతో కలిసి తిరుగుతూ వచ్చారు. ఈ కోవలో ఈ ఏడాది ఏప్రిల్ 20న మదనపల్లి చౌడేశ్వరి కళ్యాణమండపం వద్ద ఆ యువతిని ఆ యువకుడు బంగారు చైను ఇస్తే అది కుదవ పెట్టి ఇద్దరం పెళ్లి చేసుకుందామని మరో మారు నమ్మించి చైన్ తీసుకొని వెళ్ళాడు. సాయంత్రం వరకు వేచి చూసిన యువతి అతను తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులకు మొహం చెల్లక ఆ యువతి తిరుపతిలోని తన సోదరి ఇంటికి వెళ్ళింది. ఏప్రిల్ 21, 22వ తేదీలలో ఆమె ఆ యువకునితో ఇన్‌స్టాగ్రామ్ లో పెళ్లి చేసుకోవాలని నిలదీయగా ఆ యువకుడు కులాంతర వివాహం కుదరదని కావాలంటే ఉంచుకుంటానని పెళ్లి చేసుకోనని చెప్పడం తో ఆ యువతి తాను మోసపోయానని గ్రహించి తన స్వగ్రామం బల్లాపురం పల్లెకు చేరుకుని తమ ప్రేమ విషయం తల్లిదండ్రులకు తెలియజేసింది. తనకు జరిగిన అన్యాయం పై తన తల్లిదండ్రులతో కలిసి ఏప్రిల్ 30వ తేదీన తంబళ్లపల్లె పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. పోలీస్ స్టేషన్లో యువతికి తగిన న్యాయం జరగక పోవడంతో మే నెల నాలుగో తేదీన అన్నమయ్య జిల్లా ఎస్పీ గారికి లిఖితపూర్వపు ఫిర్యాదు చేసింది. అక్కడ కూడా నాకు న్యాయం జరుగుతుందో లేదో నన్న ఆందోళన చెందిన యువతి మంగళవారం ఉదయం తన స్వగృహంలో పురుగులు మందు తాగి ఆత్మహత్య కు పాల్పడింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హుటా హుటిన 108 వాహనంలో చికిత్స నిమిత్తం తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ మెడికల్ ఆఫీసర్ తేజస్వి ప్రాథమిక చికిత్సలు నిర్వహించి మెరుగైన చికిత్సల కోసం మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించాలని సూచించారు. గిరిజన యువతి కి న్యాయం జరగాలి :. గోపి దిన్నె పంచాయతీ బల్లాపురంపల్లి లో ప్రేమ పేరుతో మోసపోయిన గిరిజన యువతికి జరిగిన అన్యాయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఈ సంఘటనపై ఆ యువతికి న్యాయం జరగాలని అన్నమయ్య జిల్లా ఎస్పీ తోబాటు మదనపల్లి డిఎస్పి, ములకలచెరువు సర్కిల్ ఇన్స్పెక్టర్ కు ఫిర్యాదులు పంపుతున్నట్లు మండల టిడిపి అధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి, రాజంపేట పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు దేరంగుల చంద్రమోహన్, గోపి దిన్నె హైస్కూల్ కమిటీ చైర్మన్ వీరాంజనేయులు, గోపి దీన్నే మాజీ సర్పంచ్ సుధాకర్, మండల బీసీ నేత పురుషోత్తం, టిడిపి సీనియర్ నేత బురుజు వెంకటరమణ, తెలుగు యువత నరసింహులు మరియు టిడిపి నేతలు విలేకరులకు తెలిపారు.

# గూడూరులో వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు

**పలు ఆలయాల్లో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ప్రత్యేక పూజలు**





**గూడూరు :**నెల్లూరు జిల్లా గూడూరు పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో హనుమాన్ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. పట్టణ సమీపంలోని ఇందిరమ్మ కాలనీ సునీల్ కుమార్ నగర్‌లో వెలసిన శ్రీ కార్యాసిద్ధి ఆంజనేయ స్వామి దేవస్థానంలో స్వామివారికి విశేష అలంకరణ, అభిషేకం, హోమం మరియు ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ స్వామివారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లను నిర్వాహకులు వాటంబేడు శివకుమార్, వాటంబేడు హరికుమార్ తదితరులు పర్యవేక్షించారు. అదేవిధంగా, విఘ్నేశ్వరపురం వద్ద ఉన్న ఆంజనేయ స్వామి దేవస్థానంలో ఎమ్మెల్యే స్వయంగా అభిషేకం నిర్వహించగా,పురిటిపాలెం సమీపంలోని ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించగా, పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

**ఈరోజు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయంలోని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ వారి చాంబర్‌లో పీఆర్ మరియు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలకు చెందిన సూపరింటెండింగ్ ఇంజినీర్లు (ఎస్. ఈలు), ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని అన్ని డివిజన్ల పీఆర్ మరియు ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు (ఈ ఈ లు)తో సమీక్ష సమావేశం నిర్వహించబడింది.**





**ఏలూరు, మే 12.** జిల్లా పరిషత్ నిధుల ద్వారా మంజూరైన పనుల పురోగతిని సమీక్షించి, వేగవంతం చేయుట లక్ష్యంగా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ వారు ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ వారీగా జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించిన చైర్ పర్సన్ వారు ఇప్పటివరకు ప్రారంభం కాని పనుల జాబితాను వెంటనే సమర్పించాలని సంబంధిత ఈఈలను ఆదేశించారు. అలాగే అన్ని మంజూరైన పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి శ్రీమతి పి. జగదాంబ, పీఆర్ ఎస్.ఇ శ్రీ జెడ్. రమేష్, ఉమ్మడి జిల్లాలోని అన్ని డివిజన్ల ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు (ఈ ఈ లు), జిల్లా పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు (ఏ. ఓ) పాల్గొన్నారు.

# శ్రీ శక్తి పీఠంలో భక్తిశ్రద్ధలతో శ్రీ హనుమజ్జయంతి వేడుకలు..

**లక్ష అరటి పండ్లతో స్వామివారికి, నైవేద్యం అలంకరణ....**



**తిరుపతి మే-12**రామచంద్రపురం మండలం రాయల చెరువు కట్టపై వెలసినశ్రీ శక్తిపీఠం లో మంగళవారం శ్రీ హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలు మాత శ్రీ శక్తిపీఠం పీఠాధీశ్వరి శ్రీ రమ్యానంద భారతి స్వామిని ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో సాగాయి. ఉదయం స్వామివారికి లక్ష తమలపాకులతో అర్చన, లక్ష అరటిపండ్ల అలంకరణ నైవేద్యం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం శ్రీ తాపస మన్యుర్ పాశుపత పంచవక్త్ర హనుమత్ హోమము ఘనంగా నిర్వహించారు. వేదమంత్రోచ్ఛారణల మధ్య జరిగిన పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆంజనేయస్వామి ఆశీస్సులు పొందారు. అనంతరం మాతాజీ హనుమంతుని విజయగాథలను భక్తులకు వివరిస్తూ ధార్మిక సందేశం అందించారు. పూజ అనంతరం ప్రసాదంగా ఫలములను భక్తులకు పంపిణీ చేయడంతో పాటు అనాథాశ్రమాలు, ఆసుపత్రుల్లోనూ సేవా కార్యక్రమంగా వితరణ చేశారు. ఈ వేడుకలు ఆధ్యాత్మిక వాతావరణంలో వేలాదిగా తరలివచ్చిన భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.


# బి కొత్తకోటలో తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు- నందిశెట్టిపల్లి తాగునీటి సమస్య పరిష్కరిస్తా

**మున్సిపల్ కమిషనర్ రమాదేవి హామీ**



**బి. కొత్తకోట మే 12 ;** బి .కొత్తకోట నగర పంచాయతీలోని నంది శెట్టివీధిలో తాగునీటి సమస్య యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిస్తానని బి.కొత్తకోట నగర మున్సిపల్ కమిషనర్ రమాదేవి మహిళలకు హామీ ఇచ్చారు. బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలోని నంది శెట్టివీధిలో గత కొన్నాళ్లుగా తాగునీటి సమస్య ఏర్పడడం పై మంగళవారం మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. తాగునీటి సౌకర్యం లేక కొన్నాళ్లుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని బెంగళూరు రోడ్డులో మహిళలు ఖాళీ బిందెలతో అడ్డంగా బైఠాయించి నిరసన గళం విప్పారు. మాకు వెంటనే తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ రమాదేవి హుటాహుటిన మహిళల ధర్నా చేస్తున్న స్థలానికి చేరుకొని మహిళలతో సుదీర్ఘంగా చర్చించారు. తాగునీటి సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని ఇందుకు సంబంధించిన పైప్ లైన్ మరమ్మత్తు పనులు శరవేగంగా చేపట్టి సమస్య పరిష్కరించాలని సంబంధిత మున్సిపల్ శాఖ ఏఈని పిలిపించి ఆదేశించారు. తాగునీటి సమస్యను రెండు రోజుల్లో పూర్తిగా పరిష్కరిస్తానని మహిళలు సహకరించాలని చెప్పడంతో వారు శాంతించి ధర్నా విరమించారు. తాగునీటి సమస్య పరిష్కారం పై ఆగమేఘాల మీద స్పందించిన మున్సిపల్ కమిషనర్ రమాదేవి పనితీరుపై స్థానిక మహిళలు హర్షం వ్యక్తం చేశారు.

# తంబళ్లపల్లెలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



**తంబళ్లపల్లె మే 12 ;** తంబళ్లపల్లె మండలంలో హనుమజ్జయంతి ఉత్సవాలు హిందూ సోదరులు, ప్రజలు పెద్ద ఎత్తున జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్, కురవపల్లి, ముత్రవారిపల్లె, మరిమిరెడ్డిపల్లి, కోటకొండ, కుక్క రాజు పల్లి, గుండ్లపల్లి, గోపి దీన్ని కొత్తపల్లి, కొట్టాల, మూలపల్లి ఆంజనేయస్వామి ఆలయాలలో ఆంజనేయ స్వామి, శ్రీరామ భక్తులు, ప్రజలు స్వామివారికి ఆకు పూజ తో పాటు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, ధూప దీప నైవేద్యాలు, కర్పూర హారతులు సమర్పించారు. ఈ సందర్భంగా జై హనుమాన్, జైశ్రీరామ్ నినాదాలతో హోరెత్తించారు. పలుచోట్ల బఅన్నదానాలు, శ్రీరామ సంకీర్తనలు, చెక్క భజనలు, కోలాటాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



## మాజీ ఛాంపియన్‌కు వైల్డ్ కార్డ్.. టాప్ సీడ్స్‌కు తిప్పలేనా..!

మట్టికోర్టు పోరాటాలకు నెలవైన ఫ్రెంచ్ ఓపెన్ (ఖీతీవఅష్ట్ర రాజూవఅ)కు మరో ఆరు రోజులే ఉంది. ఇప్పటికే టాప్ సీడ్స్ జన్నిక్ సిన్నర్, జ్వెరెవ్, స్వియాటెక్‌లు తమవైన వ్యూహాలతో బిజీగా ఉండగా.. టోర్నీని మరింత ఆసక్తిగా మార్చేందుకు నిర్వాహకులు వైల్డ్ కార్డ్ ఎంట్రీలు ఖరారు చేశారు. మాజీ ఛాంపియన్ స్టాన్ వావ్రింకా , ఒకప్పటి సెమీస్ ఆడిన గేల్ మోన్‌ఫిల్స్‌కు ఆడే అవకాశమిచ్చింది. మహిళల విభాగంలో ఎనిమిది మంది వైల్డ్ కార్డ్ ఎంట్రీతో ఫ్రెంచ్ ఓపెన్ ఆడనున్నారు. రొలాండ్ గరోస్ టోర్నమెంట్‌కు వైల్డ్ కార్డ్ ఎంట్రీ సాధించిన వెటరన్ వావ్రింకా ప్రస్తుతం 125వ ర్యాంక్. కానీ, ఈ ఈవెంట్లో అతడు గుర్తుండిపోయే ప్రదర్శనలు చేసిందుకు ఈసారి నిర్వాహకులు అవకాశమిచ్చారు. 2015లో క్వార్టర్స్‌లో రోజర్ ఫెదరర్‌ను ఓడించిన ఉత్సాహంతో.. ఫైనల్లో నొవాక్ జకోవిచ్‌ను చిత్తు చేసి టైటిల్ కొల్లగొట్టాడీ స్విట్జర్లాండ్ స్టార్. గేల్ విషయానికొస్తే.. ఈ ఫ్రెంచ్ ఆటగాడు 2008లో సెమీస్ వరకూ వెళ్లాడు. కానీ, ఫెదరర్ జోరుకు నిలవలేక చేతులెత్తేశాడు.

# సవాల్ విసిరి చతికిలబడిన పాకిస్థాన్..

### • తొలి విజయంతో చరిత్ర సృష్టించిన బంగ్లాదేశ్..!

సొంతగడ్డపై తామెంత ప్రమాదకరమో బంగ్లాదేశ్ (దీుఅస్త్రశ్రీఖుఏవంష్త్ర) జట్టు మరోసారి నిరూపించింది. తొలి టెస్టులో పాకిస్థాన్ బ్యాటర్లను వణకిస్తూ భారీ విజయాన్నందుకుంది. 'దమ్ముంటే మా ముందు దమ్ముంటే మా ముందు 70 ఓవర్లలో 260పైగా లక్ష్యాన్ని నిర్దేశించండి' అని సవాల్ విసిరిన సల్మాన్ అఘాతల పొగరను అణచివేస్తూ రెండు టెస్టుల సిరీస్‌లో ఆధిక్యంలోకి వెళ్లింది. మొదటి ఇన్నింగ్స్‌లో కాస్తో కూస్తో పోరాడిన పాక్.. రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం కుప్పకూలింది. నహిద్ రానా (5-40) బంతితో చెలరేగిన వేళ బంగ్లా 104 పరుగుల తేడాతో గెలుపొందింది. తద్వారా స్వదేశంలో పాక్‌పై బంగ్లాదేశ్ మొదటి విజయంతో చరిత్ర సృష్టించింది. ఢాకా టెస్టులో ఆతిథ్య బంగ్లాదేశ్ ధాటికి పాకిస్థాన్ నిలువలేకపోయింది. 268 పరుగుల స్వల్ప ఛేదనలో




బ్యాటర్ల వైఫల్యంతో పాక్ కుప్పకూలింది. రెండో ఇన్నింగ్స్‌లో నహిద్ రానా(5-40) ఐదు వికెట్లతో బంగ్లాదేశ్ విజయంలో కీలకమయ్యాడు. మొదటి ఇన్నింగ్స్‌లో పట్టుదలగా ఆడిన పాక్ ఆటగాళ్లు ఏమో

# అక్షర్ పటేల్‌కు భారీ జరిమానా..




ధర్మశాల: ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ అక్షర్ పటేల్ బిసిసిఐ షాకిచ్చింది. సోమవారం ధర్మశాలలో పంజాబ్ కింగ్స్‌పై థ్రిల్లింగ్ విక్టరీ సాధించిన ఆనందంలో ఉన్న అక్షర్ పటేల్‌కు భారీ జరిమానా పడింది. స్లో ఓవర్-రేట్ కారణంగా ఐపిఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 ప్రకారం అక్షర్‌కు రూ.12 లక్షల జరిమానా విధించారు. ఐపిఎల్ 2026 సీజన్ లో స్లో ఓవర్-రేట్ సమస్యలు పదేపదే చర్చనీయాంశంగా మారాయి. ఈ సీజన్‌లో పలువురు కెప్టెన్లు క్రమశిక్షణా చర్యలను ఎదుర్కొన్నారు. ఇప్పటికే శ్రేయస్ అయ్యర్, శుభ్‌మన్ గిల్, హార్దిక్ పాండ్యాలకు స్లో ఓవర్ రేట్ కారణంగా జరిమానా ఎదుర్కొన్నారు.కాగా, మ్యాచ్ విషయానికి వస్తే.. పంజాబ్ నిర్దేశించిన 211 పగరుల లక్ష్య ఛేదనలో మొదట తడబడిన ఢిల్లీ.. తర్వాత పుంజుకుని అద్భుత విజయాన్ని అందుకుంది. 19 ఓవర్లలోనే 7 వికెట్లు కోల్పోయి ఢిల్లీ 216 పరుగుల చేసి థ్రిల్లింగ్ విక్టరీని అందుకుంది. ఢిల్లీ బ్యాటర్లలో కెప్టెన్ అక్షర్ పటేల్(56), డేవిడ్ మిల్లర్(51) అర్ధ శతకాలతో రాణించగా.. చివర్లలో అశుతోష్(24), మధవ్(18 నాటౌట్), అకిబ్(10 నాటౌట్) మెరుపులు మెరించడంతో ఢిల్లీ మరో ఓవర్ మిగిలుండగానే మూడు వికెట్ల తేడాతో గెలుపొందింది.

# కలల కప్ కోసం పకడ్బందీగా.. ఆల్‌రౌండర్లతో సఫారీ స్క్వాడ్..!



మహిళల టీ20 ప్రపంచకప్ సమీపిస్తుండడంతో దక్షిణాఫ్రికా బోర్డు స్క్వాడ్‌ను ప్రకటించింది. గత సీజన్‌లో రన్నరప్‌తోనే సరిపెట్టుకున్నా.. ఈసారి టైటిల్ లక్ష్యంగా మంగళవారం లారా వొల్వార్ట్ కెప్టెన్‌గా పటిష్టమైన బృందాన్ని ఎంపిక చేసింది. పొట్టి ఫార్మాట్‌లో రాణిస్తున్న15 మందికి చోటు దక్కగా.. వీరిలో సీనియర్ పేసర్ షబ్నిం ఇస్మాయిల్ కూడా ఉంది. వరల్డ్‌కప్ కోసం వీడ్కోలు వెనక్కి తీసుకున్న ఆమె మెగా ఈవెంట్‌లో సఫారీ పేస్ దళాన్ని నడిపించనుంది.అందని ద్రాక్షలా ఊరిస్తున్న ఐసీసీ ట్రోఫీని పట్టేసేందుకు దక్షిణాఫ్రికా సిద్ధమవుతోంది. నిరుడు భారత గడ్డపై వన్డే ప్రపంచకప్‌లో అదిరే ఆటతో ఫైనల్ చేరినా.. అనూహ్యంగా తడబడిన సఫారీ సైన్యం.. ఈసారి టైటిల్ లక్ష్యంగా స్క్వాడ్‌ను ఎంపిక చేసింది. అనుభవజ్ఞురాలైన లారా వొల్వార్ట్ కెప్టెన్సీలో పొట్టి ప్రపంచకప్‌ను తన్నుకుపోవడానికి వస్తోంది. వన్డే ప్రపంచకప్ ఆడిన చాలామందికి పొట్టి కప్ ఆడబోతున్నారు. కానీ, గత సీజన్‌లో సఫారీ టీమ్ ఫైనల్ చేరడంలో కీలకమైన అనెకే బాస్చ్ మాత్రం ఈ ఎడిషన్‌కు ఎంపికవ్వలేదు.



## టీ20 ప్రపంచకప్ 2026.. దక్షిణాఫ్రికా జట్టు ప్రకటన

**న్యూఢిల్లీ:** మహిళల టీ20 ప్రపంచకప్ 2026 కోసం దక్షిణాఫ్రికా తమ జట్టును ప్రకటించింది. లారా వోల్వార్డ్ జట్టుకు నాయకత్వం వహించనుంది. తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్న సీనియర్ ఫాస్ట్ బౌలర్ షబ్నిమ్ ఇస్మాయిల్ జట్టులో చోటు దక్కించుకుంది. 37 ఏళ్ల షబ్నిమ్ 2023లో అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్ బై చెప్పి.. తన నిర్ణయాన్ని మళ్లీ వెనక్కి తీసుకుంది. అలాగే, గత ఏడాది తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని, జట్టులో చేరిన మాజీ కెప్టెన్ డేన్ వాన్ నీకెర్క్ కూడా అవకాశం ఇచ్చారు. వీరితోపాటు టాజ్మిన్ బ్రిట్స్, సునే లూస్, క్లో ట్రయాన్, అయబోంగా ఖాకా వంటి పలువురు అనుభవజ్ఞులైన క్రీడాకారిణులకు జట్టులో చోటు దక్కింది. దక్షిణాఫ్రికా మహిళల టీ20 జట్టు: లారా వోల్వార్ట్ (కెప్టెన్), తజ్మిన్ బ్రిట్స్, నాడిన్ డి క్లెర్క్, అన్నరీ డెర్క్‌సెన్, షబ్నిమ్ ఇస్మాయిల్, సినాలో జాఫ్తా (ఔఖ), మారిజాన్నే కప్, అయాబొంగా ఖాకా, సునే లూస్, కరాబో మెసో (ఏఐ), నోన్‌కులులేకో మ్లాబా, క్లైలా ప్లోక్‌హుక్, క్లైలా ప్లోక్‌హుక్, నీకెర్క్.

# మా ప్లానింగే కొంపముంచింది: శ్రేయస్





హైదరాబాద్: ఐపిఎల్‌లో ప్రథమార్ధంలో వరసగా ఆరు మ్యాచ్‌లో గెలిచి పంజాబ్ కింగ్స్ పాయింట్ల పట్టికలో తొలి స్థానంలో ఉంది. ద్వితీయ ఆర్ధంలో వరసగా నాలుగు మ్యాచ్‌లలో ఓటమి చవిచూసి పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలోకి పడిపోయింది. ఇప్పుడు ప్లే ఆఫ్స్‌కు చేరుకోవడం కష్టం మారింది. మిగిలిన మూడు మ్యాచ్‌లలో గెలిస్తేనే పంజాబ్ ప్లేఆఫ్స్ కు చేరుతుంది. ఢిల్లీలో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ ఓడిపోయింది. పంజాబ్‌పై ఢిల్లీ మూడు వికెట్ల తేడాతో గెలిచింది. పంజాబ్ తొలుత 20 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 210 పరుగులు చేసింది. అనంతరం ఢిల్లీ క్యాపిటల్స్ 19 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోఏయి 216 పరుగులు చేసి విజయం సాధించింది. ఈ సందర్భంగా కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మీడియాతో మాట్లాడారు.ఈ వికెట్ 210 పరుగులు చేయడం అనేది పెద్ద టార్గెట్ అని చెప్పుకొచ్చాడు. బౌన్స్‌లో మార్పుతో పాటు సీమ్ అవుతుండడంతో తాము 30 పరుగులు ఎక్కువ చేశామని అనిపించిందన్నాడు. పిచ్ సీమర్లకు బాగా అనుకూలించడంతో పేసర్లతోనే బౌలింగ్ చేయించానని, దీంతో చాహల్ పక్కన పెట్టానని శ్రేయస్ వివరించారు. పేస్ బౌలింగ్‌లో వికెట్ల రాకపోవడంతో కెప్టెన్ గా తాను విఫలమయ్యాయని తెలియజేశాడు.

డెత్ ఓవర్లలో హార్డ్ లెంగ్త్‌కే కట్టుబడి ఉన్నామని, క్రీజులోకి వచ్చిన బ్యాటర్‌కు షార్ట్ ఆఫ్ బంతులు వేయడంతో పాటు హార్డ్ లెంగ్త్ పై ఎక్కువగా బంతులు వేయించానని శ్రేయస్ పేర్కొన్నాడు.

మా ప్లానింగ్‌లో లోపంతో పాటు ఎగ్జిక్యూషన్‌లో పర్‌ఫెక్ట్‌గా లేదన్నారు. యుజ్వేంద్ర చాహల్‌తో బౌలింగ్ చేయించకపోవడం ఓటమికి కారణమని క్రికెట్ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. తొలి ఓవర్ నుంచి 6 ఓవర్ల మధ్య యార్కర్లు సంధించలేదని అందుకే పంజాబ్ ఓటమిని చవి చూస్తోందని అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### నేనే నాలుగు ఓవర్లు బౌలింగ్ చేశానా?....

# నమ్మలేకపోతున్నా?: డిసి బౌలర్




**హైదరాబాద్:** ఐపిఎల్ లో భాగంగా పంజాబ్ పై ఢిల్లీ ఘన విజయం సాధించింది. పంజాబ్‌పై ఢిల్లీ మూడు వికెట్ల తేడాతో గెలిచింది. పంజాబ్ తొలుత 20 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 210 పరుగులు చేసింది. అనంతరం ఢిల్లీ క్యాపిటల్స్ 19 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోఏయి 216 పరుగులు చేసి ఘన విజయం సాధించింది. ఢిల్లీ క్యాపిటల్స్ విజయంలో ఓ కుర్రాడు కీలక పాత్ర పోషించాడు. మాధవ్ తీవారి నాలుగు ఓవర్ల బౌలింగ్ చేసి రెండు మెయిన్ వికెట్లు పడగొట్టాడు. చివరలో బ్యాటింగ్ కు దిగిన మాధవ్ ఎనిమిది బంతుల్లో 18 పరుగులు చేయడంతో ఢిల్లీ జట్టు విజయం సాధించింది. ఈ సందర్భంగా అతడు మీడియాతో మాట్లాడారు. ఢిల్లీ విజయంలో కీలక పాత్ర పోషించినందకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఢిల్లీ జట్టులో ఆటగాడిగా అవకాశం ఇచ్చినందుకు జట్టు మేనేజ్‌మెంట్‌కు థ్యాంక్స్ చెప్పాడు. బౌలింగ్ కోచ్ మునాఫ్ పటేల్ సర్ తో బౌలింగ్ చేయడంలో చాలా కష్టపడ్డానని, ప్రతి ప్రాక్టీస్ సెషన్‌లో మెరుగుపరుచుకోవడమే తన లక్ష్యామన్నారు.తాను నాలుగు ఓవర్లు బౌలింగ్ చేయడం అద్భుతంగా ఉందని, ఈ వికెట్‌పై లెంగ్త్ బంతులు వేయడంతో పాటు వైడ్ బాల్స్, షార్ట్ బాల్స్ వేశానని వివరించాడు. రెండో ఓవర్‌లో ఎక్కువ పరుగులు ఇస్తే తానే బౌలింగ్ చేస్తానని అక్షర్ పటేల్ సరదాగా చెప్పాడని తెలియజేశాడు. బ్యాటింగ్ కోచ్ ఇయాన్ బెల్‌తో కలిసి పవర్ హిట్టంగ్స్‌పై ఎక్కువగా ప్రాక్టీస్ చేస్తున్నానని వెల్లడించారు. తనలో పవర్ ఉందని బెల్ చెప్పాడని, అనవసరంగా ఫ్యాన్సీ షాట్లు ఆడొద్దని చెప్పాడని, బంతిని బట్టి కదలికలు ఉండాలని కోచ్ చెప్పారన్నారు. క్రికెట్‌లో మంచి చెడులు ఉంటాయని, ప్రాసెస్ కొనసాగించడం చాలా ముఖ్యమన్నారు. పంజాబ్‌తో జరిగిన మ్యాచ్‌లో తన క్యాచ్ డ్రాప్ అయిందని, పరుగులు కూడా వచ్చాయని, తనకు అదృష్టం కలిసి వచ్చిందన్నారు. తాను బౌలర్‌నా? బ్యాట్స్‌మెన్‌నా అనే ప్రశ్నకు మాధవ్ ఆసక్తికర సమాధానాలు ఇచ్చాడు. తాను వంద శాతం బౌలర్, వంద శాత బ్యాట్స్‌మెన్ అని చెప్పాడు.

బుధవారం, మే 13, 2026 | పీపుల్స్ న్యూస్ దినపత్రిక | 12

# దృశ్యం 3 తెలుగు ట్రైలర్ విడుదల..

## ఈసారి వెంకటేష్ రీమేక్ లేదు!




మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్ నటించిన సస్పెన్స్ థ్రిల్లర్ 'దృశ్యం 3' తెలుగు ట్రైలర్ విడుదలైంది. సోమవారం విడుదలైన ఈ ట్రైలర్‌తో తెలుగు ప్రేక్షకుల్లో ఉన్న ఓ ముఖ్యమైన సందేహానికి తెరపడింది. గత రెండు భాగాల్లా కాకుండా, ఈసారి వెంకటేష్‌తో రీమేక్ ఉండదని, మలయాళ వెర్షన్‌నే తెలుగులో డబ్ చేసి విడుదల చేయనున్నారని స్పష్టమైంది. మోహన్‌లాల్ పుట్టినరోజు సందర్భంగా మే 21న ఈ చిత్రం మలయాళంతో పాటు తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో ఏకకాలంలో విడుదల కానుంది.

ఈసారి కథలో కొత్త కోణాన్ని చూపించబోతున్నట్టు దర్శకుడు జీతూ జోసెఫ్ తెలిపారు. "గత రెండు భాగాల్లో జార్జ్ కుట్టికి తన వెనుక ఎవరున్నారో తెలుసు. కానీ ఈసారి తనను ఎవరు వెంబడిస్తున్నారో, శత్రువు ఎవరో తెలియని భయంలో అతను ఉంటాడు. ఇదే ఈ సినిమాను ప్రత్యేకంగా నిలబెడుతుంది" అని జీతూ జోసెఫ్ వివరించారు. ఈ తెలియని భయమే ప్రేక్షకుల్లో ఉత్కంఠను పెంచుతోంది.

ఇటీవల కొచ్చిలో జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో మోహన్‌లాల్ సరదాగా మాట్లాడుతూ.. "జార్జ్‌కుట్టిని కాపాడమని నేను చాలాసార్లు అడిగాను, కానీ అతను ఇంకా సేఫ్ కాలేదు. కాబట్టి మీరు దృశ్యం 4 కూడా ఆశించవచ్చు" అని వ్యాఖ్యానించి, సీక్వెల్స్‌పై ఆసక్తిని పెంచారు. ఈ చిత్రంలో మీనా, అన్సిబా హసన్, ఎస్తేర్ అనిల్, సిద్దిఖ్, ఆశా శరత్ వంటి వారు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

ఆశీర్వాద్ సినిమాస్ పతాకంపై ఆంటోనీ పెరుంబవూర్ నిర్మించిన ఈ చిత్రం రన్ టైమ్ 2 గంటల 39 నిమిషాలుగా ఉంది. సినిమాకు సెన్సార్ బోర్డు యు/ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. మే 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానున్న ఈ సస్పెన్స్ థ్రిల్లర్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.



# శర్వానంద్ 'భోగి'.. మందారంగా డింపుల్ హయతి

యంగ్ హీరో శర్వానంద్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'భోగి'. సంపత్ నంది దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు ఉన్నాయి. తాజాగా ఈ చిత్రం నుంచి హీరోయిన్ డింపుల్ హయతి ఫస్ట్ లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇందులో ఆమె 'మందారం' అనే పాత్రలో నటిస్తోంది.

"ప్రపంచం కోరుకున్న అందం.. కానీ ఆ ఆత్మను ఎవరూ అర్థం చేసుకోలేకపోయారు" అనే క్యాప్షన్‌తో ఈ పోస్టర్‌ను విడుదల చేశారు. ఎర్ర చీరలో డింపుల్ హయతి ఎంతో పవర్‌ఫుల్‌గా, బోల్డ్‌గా కనిపిస్తోంది. చేతిలో విసనకర్ర పట్టుకుని తీక్షణంగా చూస్తున్న ఆమె లుక్, 1960ల నాటి వాతావరణాన్ని ప్రతిబింబించేలా ఉంది. ఆమె పాత్ర చాలా శక్తిమంతంగా, ఎవరినీ లెక్కచేయని తత్వంతో ఉంటుందని చిత్ర యూనిట్ చెబుతోంది.

ఇటీవలే ఈ సినిమా నుంచి మరో హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ ఫస్ట్ లుక్‌ను కూడా విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఆమె 'కందుల సులోచనా రాణి' అనే పాత్రలో మోదుగ ఆకులతో బుట్టలు అల్లే పల్లెటూరి యువతిగా కనిపించింది. ఈ చిత్రంలో శర్వానంద్ 'గంగ' అనే పాత్రలో నటిస్తున్నాడు.

1960ల కాలంలో తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులోని ఓ కల్పిత గ్రామం నేపథ్యంలో ఈ సినిమా కథ సాగుతుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో వేసిన భారీ సెట్‌లో సినిమా షూటింగ్ వేగంగా జరుగుతోంది. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్న ఈ సినిమాను ఆగస్టు 28న రక్షాబంధన్ కానుకగా తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయనున్నారు.



# హీరోల బాటలో రకుల్ యూటర్న్.. మరో రమ్యకృష్ణ కానుందా?

ఒకప్పుడు హీరోలు తమ నటనతో ప్రేక్షకులను ఆకట్టుకొని.. ఆ తర్వాత యూటర్న్ లో భాగంగా విలన్ గా ప్రేక్షకులను మెప్పిస్తున్న విషయం తెలిసిందే.. ఈ క్రమంలోనే గ్లామర్ బ్యూటీ రకుల్ ప్రీత్ సింగ్ తన కెరీర్‌లో అత్యంత సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంది. ఎప్పుడూ చిలిపి పాత్రలు, గ్లామరస్ రోల్స్‌తో అలరించే ఈ భామ, ఇప్పుడు ఏకంగా రామాయణంలో 'శూర్పణఖ'గా నెగటివ్ షేడ్ ఉన్న పాత్రలో కనిపించబోతోంది. నితేష్ తివారీ ప్రతిష్టాత్మక చిత్రంలో రకుల్ చేస్తున్న ఈ ప్రయోగం చూస్తుంటే, ఆమె మరో రమ్యకృష్ణలా పవర్‌ఫుల్ విలనిజం పండించబోతోందని ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు. ఈ ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ విశేషాలు మీకోసం..

నితేష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఇండియన్ బిగ్గెస్ట్ మూవీ 'రామాయణ'లో రకుల్ ప్రీత్ సింగ్ ఎంట్రీ ఖరారైందనే వార్త ఫిల్మ్ నగర్‌లో సెన్సేషన్ సృష్టిస్తోంది. ఈ సినిమాలో రావణాసురుడి సోదరి శూర్పణఖ పాత్రను రకుల్ పోషించబోతుందట. ఎప్పుడూ కమర్షియల్ సినిమాల్లో మెరిసే రకుల్, కథను మలుపు తిప్పే ఇలాంటి క్లిష్టమైన పాత్రను ఎంచుకోవడం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది.

గతంలో రమ్యకృష్ణ వంటి వారు నెగిటివ్ టచ్ ఉన్న పాత్రలు చేసి తమ నట విశ్వరూపాన్ని చూపించారు. ఇప్పుడు రకుల్ కూడా అదే బాటలో నడుస్తోంది. హీరోయిన్ అంటే కేవలం గ్లామర్ మాత్రమే కాదు, నటనకు ఆస్కారమున్న నెగటివ్ షేడ్స్ కూడా చేయగలనని ఆమె నిరూపించుకోవాలని చూస్తోంది. ఈ పాత్ర కనుక క్లిక్ అయితే, రకుల్ కెరీర్ గ్రాఫ్ పూర్తిగా మారిపోవడం ఖాయం. ఈ సినిమాలో రణబీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా నటిస్తున్నారు. కన్నడ రాకింగ్ స్టార్ యష్ రావణాసురుడిగా కనిపించబోతుండగా, ఆయనకు సోదరిగా రకుల్ తన పెర్ఫార్మెన్స్‌తో పోటీ పడనుంది. ఇక యష్, రకుల్ కాంబినేషన్ వెండితెరపై ఎలా ఉంటుందోనని అభిమానులు ఇప్పటి నుంచే ఈగర్ గా వెయిట్ చేస్తున్నారు. శూర్పణఖ పాత్ర రామాయణంలో చాలా కీలకమైనది. ఒకరకంగా కథలో ఘర్షణ మొదలయ్యేది ఆమెతోనే. ఈ పాత్రలో రకుల్ సక్సెస్ అయితే, భవిష్యత్తులో ఆమె కోసం మరిన్ని వైవిధ్యమైన, నెగటివ్ షేడ్ ఉన్న పాత్రలు క్యూ కట్టడం గ్యారెంటీ. కేవలం అందంతోనే కాదు, తనలోని నటనతోనూ ఆడియన్స్‌ను భయపెట్టేందుకు రకుల్ సిద్ధమవుతోంది. స్టార్ హీరోయిన్ స్థాయి నుంచి గ్రే షేడ్ పాత్రకు యూటర్న్ తీసుకోవడం రకుల్ చేస్తున్న పెద్ద రిస్క్ అనే చెప్పాలి. కానీ, ఇలాంటి రిస్క్ తీసుకుంటేనే నటిగా గుర్తింపు వస్తుంది. మరి రామాయణంలో శూర్పణఖగా రకుల్ ఎంతవరకు మెప్పిస్తుందో చూడాలి.

# ఎన్టీఆర్-నీల్ క్రేజీ అప్డేట్.. ముందుగానే ఫస్ట్ గ్లింప్స్?

2027 జూన్ 11న సినిమా రిలీజ్ అని తాజా సమాచారం

యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్' ప్రాజెక్ట్‌కు సంబంధించి ఒక ఆసక్తికరమైన అప్‌డేట్ టాలీవుడ్‌లో చక్కర్లు కొడుతోంది. 'కేజీఎఫ్', 'సలార్' చిత్రాల దర్శకుడు ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ చిత్రంపై దేశవ్యాప్తంగా అంచనాలు నెలకొన్నాయి. కాగా, తారక్ పుట్టినరోజు సందర్భంగా మే 20న ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్ విడుదల చేస్తారని అందరూ భావించారు. అయితే, అభిమానుల ఉత్సాహాన్ని మరింత పెంచేలా మేకర్స్ ఒక రోజు ముందుగానే ఈ గ్లింప్స్‌ను విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. మే 19 అర్ధరాత్రి 12 గంటలకు ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేసి, తారక్ పుట్టినరోజు వేడుకలను ముందుగానే ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారని సమాచారం. దీంతో అభిమానుల సంబరాలు అర్ధరాత్రి నుంచే మొదలయ్యే అవకాశం కనిపిస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ పాన్-ఇండియా చిత్రం '===' తర్వాత తారక్ చేస్తున్న సోలో ప్రాజెక్ట్ కావడంతో దీనిపై భారీ హైప్ నెలకొని ఉంది. ఈ చిత్రాన్ని 2027 జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు కూడా వార్తలు వస్తున్నాయి. ప్రశాంత్ నీల్ మార్క్ యాక్షన్, ఎలివేషన్స్‌తో తారక్‌ను ఎలా చూపిస్తారోనని సినీ ప్రియులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.



# మహాకాళేశ్వరుడి సన్నిధిలో తమన్నా..

ప్రముఖ నటి తమన్నా ఈ తెల్లవారుజామున మధ్యప్రదేశ్‌లోని ప్రసిద్ధ ఉజ్జయిని మహాకాళేశ్వర ఆలయాన్ని సందర్శించారు. బ్రహ్మ ముహూర్తంలో జరిగే అత్యంత పవిత్రమైన 'భస్మ హారతి' సేవలో ఆమె పాల్గొన్నారు. సాంప్రదాయ దుస్తులు ధరించి, తన స్నేహితురాలు, నిర్మాత ప్రజ్ఞా కపూర్‌తో కలిసి ఆమె స్వామివారిని దర్శించుకున్నారు. వేద మంత్రోచ్చారణలు, గంటల నాదాల మధ్య జరిగిన ఈ క్రతువులో తమన్నా అత్యంత భక్తిశ్రద్ధలతో లీనమై ప్రార్థనలు చేస్తున్న వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

దర్శనం అనంతరం తమన్నా మీడియాతో మాట్లాడుతూ, "దైవ పిలుపు ఉన్నప్పుడే ఎవరైనా ఈ క్షేత్రాన్ని దర్శించుకోగలరు. ఈ రోజు భస్మ హారతిని వీక్షించే అవకాశం కలగడం నా అదృష్టం. అక్కడ కూర్చుని ఆ ఆధ్యాత్మిక ప్రకంపనలను అనుభూతి చెందడం ఒక గొప్ప శక్తిని ఇచ్చింది" అని తన సంతోషాన్ని పంచుకున్నారు. ఆలయ గర్భాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆమె, తన రాబోయే ప్రాజెక్టులు విజయవంతం కావాలని మొక్కుకున్నారు. సినిమాల విషయానికి వస్తే, తమన్నా త్వరలో సిద్ధార్థ్ మల్హోత్రాతో కలిసి 'వ్యాన్' అనే ఫోక్‌లోర్ థ్రిల్లర్‌లో నటించబోతున్నారు. ఏక్తా కపూర్, టీవీఎఫ్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం 2026 ఆగస్టు 28న రక్షా బంధన్ కానుకగా విడుదల కానుంది. మధ్య భారతదేశంలోని దట్టమైన అడవుల నేపథ్యంలో, పురాతన ఇతిహాసాలు, దేవాలయాల చుట్టూ ఈ కథ సాగనుంది. దీపక్ మిశ్రా, అరుణభ్ కుమార్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు.



Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com